
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



కృష్ణా జిల్లా వార్తలు

గురువారం 23 జనవరి 2025



తోట్లవల్లూరు ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీలోడుతో వెళ్తున్న ఇసుక లారీలు

ఇసుక లారీలతో రోడ్లు ఛిద్రం

అధిక లోడుతో యథేచ్ఛగా రాకపోకలు

పదిటైర్ల లారీ సామర్థ్యం 18 టన్నులే..

- 22 టన్నుల అధిక లోడుతో వస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఇసుక లారీలపై నిషేధం విధించిన రొయ్యూరు పంచాయతీ
- అన్ని క్వారీల లారీలు తోట్లవల్లూరు రోడ్డు నుంచే..
- దెబ్బతింటున్న కోట్ల రూపాయలతో వేసిన రోడ్లు, వంతెనలు



గుర్విందపల్లి వద్ద ఛిద్రమైన కరకట్ట తారురోడ్డు

పదిటైర్లు, పన్నెండు టైర్ల ఇసుక లారీలు అధిక లోడుతో తోట్లవల్లూరు మండలంలో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి దెబ్బకు కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లు, వంతెనలు ధ్వంసమైపోతున్నాయి. లారీల క్యాబిన్ దాటి కొండలాగా పోసుకుని వస్తున్న ఇసుక లారీలను చూసి ప్రజలు భయపడిపోతున్నారు. అధిక లోడును అడ్డుకోవాల్సిన ఆర్టీవో అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారని విమర్శలు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలంలోని రొయ్యూరు, నార్తువల్లూరులో ప్రభుత్వ ఇసుక క్వారీలున్నాయి. నార్తువల్లూరు క్వారీ స్టాక్ పాయింట్ వల్లూరుపాలెంలో ఏర్పాటు చేశారు. పక్కనే కంకిపాడు మండలం మద్దూరు ప్రభుత్వ క్వారీ ఉంది. లంకపల్లి, శ్రీకాకుళం క్వారీలున్నాయి. రివర్ కన్జర్వెన్సీ(ఆర్సీ) నిబంధనల ప్రకారం తీర గ్రామాల రక్షణ కోసం నిర్మించిన కరకట్టపై భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉంది. క్వారీ నుంచి వచ్చే ఇసుక లారీ కరకట్ట ఎక్కి ఆ గ్రామంలోకి ప్రవేశించి వెళ్లాలి. అంతే తప్పా కరకట్టపై కిలోమీటర్ల మేర ఇతర గ్రామాలకు ప్రయాణించకూడదని, దానివల్ల కరకట్ట బలహీనపడి తీర గ్రామాల రక్షణకు ప్రమాదమేర్పడుతుందని ఆర్సీ చట్టం చెపుతోంది. అయితే అందుకు విరుద్ధంగా ఇసుక లారీలలో దాని సామర్థ్యానికి మించి జరుగుతున్న ఇసుక రవాణాతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులు పాడైపోవడం, వంతెనలు దెబ్బతినడం జరుగుతోంది. పదిటైర్లు, పన్నెండు టైర్ల ఇసుక లారీలు కరకట్టపై రాకపోకలు సాగిస్తుండటంతో అనేకచోట్ల కరకట్ట తారు రోడ్డు ఛిద్రమై గోతులమయంగా తయారయింది.

పట్టించుకోని అధికారులు

బైక్‌లపై ముగ్గురు ప్రయాణించినా, ఆటోలో ఐదుగురి కంటే ఎక్కువమంది ప్రయాణించినా కేసులు నమోదు చేసి జరిమానాలను విధిస్తున్న రవాణాశాఖ అధికారులు, పోలీసులు ఓవర్ లోడు ఇసుక లారీలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లారీలకు ఎందుకు జరిమానాలు వేయరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ లారీల వల్ల రహదారులు పాడైపోయి ప్రజలకు ఇబ్బంది కలుగుతుంటే చోద్యం చూడటం తగదని అంటున్నారు.

రొయ్యూరులోకి భారీ వాహనాలపై నిషేధం

మద్దూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం స్టాక్ యార్డుల నుంచి ఇసుక లోడింగ్ చేసుకున్న లారీలన్నీ కరకట్టపై ప్రయాణించి తోట్లవల్లూరు గ్రామంలో నుంచి ఉయ్యూరు వైపుకి వెళుతున్నాయి. ఏనుగుల కోడు డ్రెయిన్‌పై వంతెన బలహీనంగా ఉందని, రూ.3 కోట్లతో నిర్మించి రోడ్డు దెబ్బతింటుందని రొయ్యూరులోకి ఇసుక

మిగతా 6లో..





నవోదయ పాఠశాలలో ఉపయోగిస్తున్న బూజుపట్టిన కందిపప్పు, కూరగాయలు

నవోదయలో నాసిరకం వంటలు

- కుళ్లిపోయిన కూరగాయలు, బూజుపట్టిన కందికప్పు వినియోగం
- అధికారులకు ఆధారాలతో పాఠశాల ఉపాధ్యాయుడి ఫిర్యాదు
- ఆ ఆరోపణల్లో వాస్తవంలేదన్న ప్రిన్సిపాల్

మచిలీపట్నం, జనవరి22 (ఆంధ్రజ్యోతి): "బాపులపాడు మండలం వేలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో నాసిరకం కూరగాయలు, బూజుపట్టిన కందిపప్పు తదితర నిత్యావసరాలతో వంటలు చేస్తున్నారు. వాటినే విద్యార్థులకు పెడుతున్నారు. ఇవిగో వీటికి సంబంధించిన ఆధారాలు" అంటూ అధికారులకు బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఒకరు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు ఉండగా, 600 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పాడైపోయిన కూరగాయలు, బూజుపట్టిన నిత్యావసర సరుకులు సరఫరా అవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సరుకులతోనే విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారని, దీనిపై పలుమార్లు ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో వాడుతున్న నాసిరకం నిత్యావసర సరుకులు, కూరగాయల ఫొటోలను కూడా ఫిర్యాదుతో పాటు జతచేశారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని సదరు ఉపాధ్యాయుడు కోరాడు. దీనిపై నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావును వివరణ కోరగా డోలా చంద్రరావు అనే ఉపాధ్యాయుడి ప్రవర్తన బాగుండక పోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయన్నారు. వీటిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి ఆయనను ఈ నెల 21వ తేదీన విధుల నుంచి తొలగించారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నాడని చెప్పారు. అవి వాస్తకం కాదన్నారు. ఈ అంశంపై ఎలాంటి విచారణకు అయినా సిద్ధమని స్పష్టం చేశారు.

కూచిపూడి కోర్సులపై నాక్ బృందం అభినందనలు 8లో

'అవినీతి భాగస్వామి రగడ'పై

డీటీసీ అటెన్షన్!

- ఎంవీఐల తీరుపై ఆగ్రహం
- కాన్ఫరెన్స్ హాల్‌లో రహస్యంగా సమావేశం.. సిండికేట్‌లపై ఆరా

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

(ఆంధ్రజ్యోతి- విజయవాడ): రవాణా శాఖలో అవినీతి వ్యవహారాలపై 'అవినీతి భాగస్వామి రగడ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' బుధవారం ప్రచురించిన ప్రత్యేక కథనంపై జిల్లా ఉపరవాణాశాఖ అధికారి (డీటీసీ) మోహన్ స్పందించారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐ)ల సిండికేట్, ప్రైవేట్ వ్యక్తి వసూళ్లపై విచారణ ప్రారంభించారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అత్యవసరంగా విజయవాడలోని రవాణాశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పలువురు ఎంవీఐలతో రహస్యంగా సమావేశమయ్యారు. ఈ వ్యవహారాలు ఎప్పటి నుంచి జరుగుతున్నాయి? నగదు కలెక్షన్ చేస్తున్న ఆ వ్యక్తి ఎవరు? సిండికేట్‌లో ఎవరెవరు ఉన్నారు? లారీల సిండికేట్‌లో ఎవరున్నారు? వంటి అంశాలపై డీటీసీ విచారణ జరిపినట్టు తెలుస్తోంది.

త్వరలో లాయర్లకు రక్షణ చట్టం! 8లో

3 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 8లో

సాగునీటి కాలువలకు మంచిరోజులు!

మరమ్మతులు చేయాలని నీటి సంఘాల విజ్ఞప్తి



శివగంగ డ్రెయిన్‌లో గుర్రపు డెక్క

- సాగునీటి పారుదలశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష
- ఫిబ్రవరి 3వతేదీ నాటికి పనుల అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశం
- నీటి సంఘాల ద్వారా అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ఇవ్వనున్న నివేదిక

సాగునీటి కాలువలకు ఇక మంచి రోజులు రానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి సంఘాలు ఏర్పడ్డాయి. వీటి పర్యవేక్షణలో ఈ ఏడాది కృష్ణాడెల్టాలో సాగునీటి కాలువలు, డ్రైనేజీల మరమ్మతు పనులు పూర్తి స్థాయిలో చేయాలనే లక్ష్యంతో అంచనాలు రూపొందిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం పంట కాలువలు, డ్రైనేజీల మరమ్మతులకు సంబంధించిన అనుమతులను ఏప్రిల్ నాటికి ఇస్తే మేలో పనులు ప్రారంభించి జూన్ నెలాఖరుకు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కాలువల నిర్వహణ పనులపై కలెక్టర్ బాలాజీ బుధవారం నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 3వ తేదీ నాటికి పనులకు సంబంధించిన అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణాడెల్టాలో 13.08 లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది. కేఈబీ, బందరు, రైవస్ కాలువ, రామరాజుపాలెం కాలువ, బంటుమిల్లి కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాలువల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసింది. సాగునీటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేయడంతో కాలువల పర్యవేక్షణ చేసే వారే కరువయ్యారు. తుఫాన్‌లు, భారీవర్షాల సమయంలో గత నాలుగు సంవత్సరాల పాటు రైతులు పంటలను కోల్పోయారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన

మిగతా 6లో..



బియ్యం బీర్..!

పీడీఎస్ రైస్‌తో బీరు తయారీ

కోళ్ల మేత, చేపల మేత, స్వీట్ల దుకాణాలకు పీడీఎస్ బియ్యాన్ని తరలించడం చూశాం.. విన్నాం.. తాజాగా బీరు తయారుచేసే ఫ్యాక్టరీలకు కూడా పేదల బియ్యాన్ని తరలిస్తున్నారన్న విషయం బయటకొచ్చింది. కోళ్లు, చేపల మేత కోసం నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్నే తరలిస్తుండగా, రాష్ట్రంలోని ఓ బీరు ఫ్యాక్టరీకి మాత్రం ఏకంగా నాణ్యత తక్కువగా ఉండే రంగుమారిన బియ్యం తరలిస్తుండటం ఆశ్చర్యపోవాల్సిన విషయం.

- తడిసి, రంగుమారిన బియ్యానికి భలే డిమాండ్
- ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి తరలుతున్న పేదల బియ్యం
- రైతుల వద్ద తక్కువ ధరకు కొంటున్న వ్యాపారులు
- మిల్లుల్లో ఆడించి బీరు ఫ్యాక్టరీలకు మంచి ధరకు విక్రయం
- నష్టపోయేది రైతు.. లాభపడేది ప్రైవేట్ వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొంతకాలం కిందట మిచౌంగ్ తుఫాను మిగిల్చిన విషాదం కొంతమంది బియ్యం కొనుగోలు వ్యాపారులకు కాసులు కురిపించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023, డిసెంబరు 1 నుంచి 6 వరకు మిచౌంగ్ తుఫాను బీభత్సం సృష్టించింది. దీని కారణంగా ఉమ్మడి జిల్లాలో రైతాంగం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. ఈ తుఫానుకు తడిసిన ధాన్యాన్ని కొంటామని అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. కానీ, కొనుగోలు చేసే విషయంలో అనేక అవాంతరాలు ఏర్పడ్డాయి. మిల్లర్ల ఆంక్షలతో స్వేచ్ఛగా విక్రయించుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ప్రైవేట్ ధాన్యం కొనుగోలు వ్యాపారులు వీటిని అతి తక్కువ ధరకే కొన్నారు. తడిసిన ధాన్యం.. వారం పాటు నానిపోయాక గోధుమ, ముదురు రంగులోకి మారతాయి. వీటికి వాసన వస్తుంది కనుక తినటానికి పనికిరావు. సార్టెక్స్ చేయడానికి కూడా ఉపయోగపడవు. తడిసిన బియ్యం నిర్ణీత శాతం వరకు అయితే సార్టెక్స్ చేయటానికి పనికొస్తాయి. ఆ శాతం దాటితే మాత్రం రంగు మారిపోతాయి. ఆ బియ్యాన్ని కొనటానికి ఎవరూ సాహసించరని

మిగతా 6లో..



జగ్గయ్యపేట డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అనధికార డంపింగ్‌లపై నిఘాపెట్టండి

- జగ్గయ్యపేటలో కలెక్టర్ విస్తృత పర్యటన
- విలియంపేట డంపింగ్‌యార్డు తరలింపునకు ఆదేశాలు

జగ్గయ్యపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అనధికార డంపింగ్ ప్రాంతాలలో సీసీ కెమెరాలతో నిఘా పెట్టి చెత్త వేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసు కోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జగ్గయ్యపేట శివారు విలియంపేటలో ఉన్న డంపింగ్ యార్డును తరలించేందుకు వెంటనే ప్రత్యామ్నాయం అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జగ్గయ్యపేట పట్టణంలో విలియంపేట డంపింగ్‌యార్డును ఎమ్మెల్యే తాతయ్య, చైర్మన్ రాఘవేంద్రలతో కలిసి పరిశీలించారు. అంతకుముందు ఆయన జయంతిపురంలో ఆర్ఎస్. నెం.93లో ఏపీఐఐసీకి కేటాయించిన 498.68 ఎకరాలు ఎంసీ ల్యాండ్‌ను పరిశీలించగా అక్కడ పరిశ్రమల స్థాపనకు అడ్డంకిగా ఉన్న కోర్టు వివాదం, రోడ్డు సమస్యను పరిష్కరించాల్సి ఉందని అధికారులు వివరించారు. భీమవరం వద్ద ఏపీఐఐసీకి కేటాయించిన ఆర్.ఎస్ నెం.65లోని 325 ఎకరాల భూమిని, చిల్లకల్లులోని 109 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. వాటిపై ఉన్న కోర్టు వ్యాజ్యాలను అధికారులు వివరించారు. చిల్లకల్లు రెవెన్యూ సదస్సులో తొమ్మిదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యను పరిష్కరించిన చిల్లకల్లు రైతు ప్రతిస్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా అంతటా తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలను మరింత భాగస్వాముల్ని చేయాలని అభిప్రాయపడ్డారు. ఆయన వెంట నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, జగ్గయ్యపేట తహసీల్దార్ మనోహర్, కమిషనర్ రామ్మోహన్, కౌన్సిలర్లు నకిరికంటి వెంకటి, పేరం సైదేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కోట వీరబాబు, రాటకొండ చంద్రశేఖర్

రైతులకు అండగా నీటి సంఘాలు

- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు

నందిగామ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌పీ కాలువల పటిష్టత, సమగ్ర నీటి పంపిణీ అంశాలపై దృష్టిసారించి నీటి సంఘాలు రైతులకు అండగా ఉంటాయని ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్ర శేఖర్‌లు అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఎస్‌పీ డీఈ కార్యాలయంలో ఆయన రికార్డులు పరిశీలించి ఎన్ఎస్‌పీ ఆస్తుల అన్యాక్రాంతంపై ఆరా తీశారు. అనంతరం నీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ఫలితంగా పలుచోట్ల సాగర్ కాలువలు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. ఇకపై వారబందీ విధానం అమలు చేసి నీటిని సమర్థవంతంగా కిందకు నడిపిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. తీర్మానాలను జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడికి అందజేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఈఈ ఆర్.సంతోష్, డీఈ సుబ్బారావు, ఏఈ నాగరాజు, అనిల్, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ చేస్తున్న అధికారులు

ఉపాధి నిధులు రూ.20 లక్షలు స్వాహా

వత్సవాయి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనుల్లో సుమారు రూ.20 లక్షల అవినీతి జరిగినట్టు గుర్తించామని డ్వామా పీడీ రాము తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఉపాధి పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలోని 28 గ్రామాల్లో జరిగిన పనుల్లో అవినీతి జరిగినట్టు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు జాబ్ కార్డు వేతనంతో పాటు అమెరికాలో ఉన్నవారికి సైతం జాబ్ కార్డు వేతనం చెల్లించినట్టు తేలిందన్నారు. ఎఫ్ఏలు నిధులు స్వాహా చేసినట్టు గుర్తించామన్నారు. ఎక్కువ మొత్తంలో భీమవరంలో 4.10 లక్షలు, మంగొల్లులో 2.24 లక్షలు, దేశిపాలెంలో 1.43 లక్షలు, చిట్యేలలో 1.13 లక్షల అవినీతి జరిగనట్టు గుర్తించామన్నారు. ఆ నిధులను ఎఫ్ఏల నుంచి జరిమానాతో సహా వసూలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎం.బాలాజీ, ఏపీడీ పార్థసారథి, ఎంపీడీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పొందుగల పంచాయతీకి అరుదైన గౌరవం

- ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు సర్పంచ్‌కు ఆహ్వానం



గుగులోతు కోటమ్మ, సర్పంచ్

మైలవరంరూరల్, జనవరి 22, (ఆంధ్రజ్యోతి) : పొందుగల గ్రామపంచాయతీకి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు అతిథిగా హాజరుకావాలని సర్పంచ్ గుగులోతు కోటమ్మకు ప్రత్యేక ఆహ్వానాన్ని అధికారులు అందజేశారు. ప్రతీఏటా గణతంత్ర దినోత్సవం నాడు దేశంలో అత్యుత్తమ సేవలు అందించిన గ్రామపంచాయతీలను గుర్తించి ఆయా సర్పంచ్‌ల గొంతుకను ఈ వేదిక ద్వారా వినిపించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయడంతోపాటు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిన దేశంలోని వెయ్యి గ్రామ పంచాయతీలలో ఎన్టీఆర్ జిల్లా పొందుగల పంచాయతీ ఎంపికవడం విశేషం.

వీఆర్‌కు ఎస్ఐ అర్జునరాజు

తోట్లవల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు ఎస్ఐ ఎం.అర్జునరాజును వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేసినట్టు పోలీసు వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి. గతేడాది ఆగస్టులో ఎస్ఐగా వచ్చిన అర్జునరాజును ఆరు నెలల కాలంలోనే వీఆర్‌కు పంపటం చర్చనీయాంశమైంది. ఎస్ఐ తీరుపట్ల అధికారపార్టీ నేతలు అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. వల్లూరుపాలెం జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి చెన్నుపాటి శ్రీధర్‌ను స్టేషన్‌కు పిలిచి పాత కేసులపై రైడీషీట్ తెరవాల్సి ఉంటుందని హెచ్చరించటం రచ్చకు దారితీసింది. ఇటీవల వైసీపీ సానుభూతిపరులైన ఇసుక కార్మికులు ఏకంగా 15 గంటలపాటు ఇసుక క్వారీ వద్ద ధర్నా నిర్వహించినా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంపై టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐ వైఖరిపై శ్రీధర్ పోలీసు అధికారులకు, టీడీపీ పెద్దలకు ఫిర్యాదు చేయటం.. భద్రిరాజుపాలెంలో గంగానమ్మ జాతర సందర్భంగా పలువురిని అవమానానికి గురిచేసి ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన తీరు విమర్శలకు దారితీసిందని చెపుతున్నారు.

మామిడి పోతున్నాయ్!



కోడి పేలు ఉధృతికి రాలిపోయిన పూత

మామిడికి రైతుకు తీరని నష్టం చేస్తున్న నల్లి, కోడిపేలు

- నివారణ మందుల్లో అవగాహన లేమి
- కాడలుగా మిగులుతోన్న మామిడి తోటలు
- జిగురు అట్టల ఏర్పాటుతో కొంత మేలు
- ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి

(రెడ్డిగూడెం-ఆంధ్రజ్యోతి)

నల్లి, కోడి పేలు మాట వింటేనే రెడ్డిగూడెం మండలం మామిడి రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత మూడేళ్లుగా కోడి పేలు మామిడి పంటను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. దీని నివారణకు ఇప్పటి వరకు సరైన మందు లేకపోవడంతో రైతులు అవగాహన లేకుండా పురుగు మందులను పిచికారీ చేసి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈఏడాది డిసెంబరు నెలాఖరు నుంచే పేను ఉధృతి మామిడి తోటల్లో ఎక్కువగా ఉండటంతో ఎన్ని మందులు కొట్టినా పేలు, నల్లి అదుపులోకి రాకపోవడంతో మామిడి రైతులు దిక్కుతోచని స్థితిలో విలవిల్లాడుతున్నారు. వీటి ఉధృతికి మామిడి చెట్లు పూతలేని ఒట్టి కాడలుగా మిగులుతున్నాయి. రెండేళ్ల క్రితం వరకు రెడ్డిగూడెం మండలం మామిడికి ప్రసిద్ధి గాంచింది. వాతావరణంలో మార్పులు, అతి ప్రమాదకర నల్లి, కోడి పేలు బారిన పడి మామిడి తోటలు పూత దశలోనే మాడిపోతున్నాయి. దీంతో మామిడి రైతులు విలవిల్లాడిపోతున్నారు. ఏడాది పొడవునా సస్య రక్షణ చర్యలు చేపట్టి, పెట్టుబడులు పెట్టి ఆశగా ఎదురు చూసే రైతులకు తీవ్ర నిరాసే మిగులుతోంది. ఉద్యానశాఖ అధికారులు సైతం నామమాత్రపు సదస్సు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప మామిడి రైతులకు సరైన అవగాహన కల్పించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

జిగురు అట్టలపై అవగాహన కల్పించాలి

నల్లి, పేల నివారణకు జిగురు అట్టలు కడితే ఫలితాలు లభిస్తున్నప్పటికీ కొందరు రైతుల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. జిగురు అట్టలు కట్టిన తోటను వదిలేసిన పేలు, నల్లి ఇతర తోటలపై పడుతున్నాయి. అట్టలు ఉన్నంత వరకు తోటలకు రక్షణ ఉన్నా, మిగిలిన తోటల వల్ల వాటి ఉధృతి పెరిగి అట్టలు కట్టిన తోటలకు ప్రమాదం ఏర్పడుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. ఉద్యానశాఖ అధికారులు పలు దఫాలుగా అవగాహన సదస్సులు పెట్టి జిగురు అట్టలు కట్టించే ఏర్పాట్లు చేస్తే నల్లి, పేలు నివారణ సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



తోటలో ఏర్పాటు చేసిన జిగురు అట్టలు

రెండేళ్ల నుంచి తీవ్ర నష్టాలు

- కె.పరమేశ్వరరావు, రెడ్డిగూడెం



నల్లి, కోడి పేలు వల్ల రెండేళ్ల నుంచి తీవ్ర నష్టం జరుగుతోంది. ఏ మందు కొట్టినా అవి అదుపుకావడం లేదు. ఉద్యానశాఖ అధికారుల సూచనల మేరకు జిగురు అట్టలు తోటలో చెట్టుకు ఆరు నుంచి ఏడు కట్టాను. కొంత వరకు ఫలితాన్ని ఇచ్చాయి. కోడిపేలు, నల్లి అట్టలపై వాలి అతుక్కుపోతున్నాయి. అందరూ అట్టలు పెట్టుకుంటే ప్రయోజనం ఉంటుంది.

చెట్టుకు రెండు అట్టలు చొప్పున పెట్టుకోవాలి

- నరేంద్ర కుమార్, ఉద్యాన అధికారి

నల్లి, పేను నివారణకు ఒక్కొక్క మామిడి చెట్టుకు బ్లూ, పసుపు జిగురు అట్టలు రెండు చొప్పున పెట్టుకోవాలి. ఫిప్రోనిల్ లీటర్ నీటికి రెండు మిల్లీ లీటర్లు థయోమిథాక్సిన్ లీటర్ నీటికి 0.3 గ్రాముల చొప్పున వారానికి ఒక సారి పిచికారీ చేసుకోవాలి.

హెల్మెట్‌లు లేకుంటే తిరగలేం

- చిట్టెంశెట్టి వెంకట రాధాకృష్ణ



సాయంత్రం వేళల్లో తోటల్లోకి హెల్మెట్ లేకుండా వెళ్లలేపోతున్నాం. తోటలు ఉన్న చోట్ల రహదారిపైనా తిరిగే పరిస్థితి లేదు. ఊరిలోకి ఇవి ప్రవేశించాయి. పెరట్లో పూలమొక్కలు బతికే పరిస్థితి లేదు. వీటి ఉధృతి ఈఏడాది అధికంగా ఉంది. నివారణకు సరైన మందు కనిపెడితే తప్ప మామిడి బతికే పరిస్థితి లేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతమే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న విజయరామరాజు

పటమట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకు సాగుతుందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. మేరిస్టెల్లా కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని మానవవనరుల అధికారులు, హెచ్‌ఎంలతో నూతన విద్యా విధానంపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యను బలోపేతం చేసేందుకు మానవవనరుల విభాగంలో భాగస్వామ్యమయిన మేధావి వర్గంతో అవగాహనతో కూడిన శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. ఎంపీయూపీ పాఠశాలలో 6, 7, 8 తరగతులు ఉన్నచోట విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. నూతన ప్రతిపాదిత విద్యావిధానంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా శాటిలైట్ ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ హైస్కూల్ పాఠశాలలను ఉన్నతీకరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్లు డీకే బాలాజీ, జి.లక్ష్మీశ, జి.నాగమణి, డీఈవోలు యూవీ సుబ్బారావు, పీవీజే రామారావు, ప్రత్యేకాధికారులు, ఎమ్మీవోలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



సాగు ఖర్చులకు అనుగుణంగా
పంట రుణాలు

- అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రుణ పరిమితి ప్రతిపాదనలు
- ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- డీఎల్‌టీసీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ పంటల సాగు ఖర్చులకు అనుగుణంగా రైతులకు పంటరుణాల మంజూరుకు మార్గదర్శకాల ప్రకారం పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకొంటున్నామని, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యల్లో రైతులు కీలక భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కృష్ణా జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ - ఎన్టీఆర్ జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశం బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, ప్రగతిశీల, రైతులు, బ్యాంకర్లు తదితరులు హాజరుకాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలకు ఎకరా విస్తీర్ణానికి రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై ప్రతిపాదనల రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటల సాగు వ్యయం, దిగుబడి విలువ, రుణ పరిమితి వివరాలను పరిశీలించి, తదుపరి 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాగు ఖర్చు, దిగుబడి విలువ అంచనాల ఆధారంగా నిర్ణయించాల్సిన రుణ పరిమితిపై వ్యవసాయం, ఉద్యాన, మత్స్య తదితర శాఖల అధికారులు తమ అభిప్రాయాలను సమావేశం ముందుంచారు. రైతులు వివిధ పంటల సాగుకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంట కోతలు తదితరాలకు అయ్యే ఖర్చుల వివరాలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ ద్వారా 2025-26కు గాను వరికి రుణ పరిమితి రూ.46వేలు, మిరప (డ్రై)కు రూ.1,10,000, మిరప (ఇరిగేటెడ్)కు రూ.1,15,000, మామిడికి రూ.42,500, ఆయిల్‌పామ్‌కు రూ.75 వేలు, పట్టు పురుగుల పెంపకానికి రూ.60,000 వివిధ పంటలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రుణపరిమితిని ప్రతిపాదించడం జరిగిందని వివరించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గతేడాది కంటే అధిక రుణ పరిమితిని ప్రతిపాదించినట్టు తెలిపారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమతికి) అదనంగా 30శాతం వరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ రంగాల రైతుల సంక్షేమానికి అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో ఎ.శ్యామ్ మనోహర్, జీఎం ఎ.రంగబాబు, అసిస్టెంట్ ఎల్‌డీఎం ఎం.రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి బి.విజయకుమారి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ప్రగతిశీల రైతులు, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



నాగాయలంక ప్రధాన డ్రెయిన్‌లపై అవుట్‌ఫాల్ స్లూయిస్‌గేట్లు

సాగునీటి కాలువలకు మంచిరోజులు!

(5వ పేజీ తరువాయి)

ఆరు నెలలకే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో సాగునీటి సంఘాల ద్వారా పంట కాలువలు, డ్రెయిన్‌ల్లో మరమ్మతులు చేసేందుకు ఇప్పటికే అంచనాలు రూపొందించారు. ఇటీవల సాగునీటి సంఘాల ద్వారా రూ.20లక్షల వరకు కాలువల నిర్వహణ పనులను నామినేషన్ పద్ధతిన కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. ప్రభుత్వం గతంలో రూ.5లక్షల వరకు నామినేషన్ పద్ధతిని పనులు కేటాయించిందని, ఈ ఏడాది నుంచి రూ.10 లక్షలకు ఆ మొత్తాన్ని పెంచి నామినేషన్ పద్ధతినే సాగునీటి సంఘాలకు పనులు అప్పగించేందుకు సూచనప్రాయంగా అంగీకరించింది. గడచిన ఏడాది కాలువల నిర్వహణ (ఓఅండ్‌ఎం) పనుల నిమిత్తం జిల్లాకు కేవలం రూ.26 కోట్లను కేటాయించారు. ఈ నిధులతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, నాచులను తొలగించాలని మాత్రమే అంచనాలు రూపొందించారు. కాలువలకు నీటిని విడుదల చేసిన తర్వాత ఈ నిధులతో పనులు చేయడంతో సక్రమంగా జరగలేదు. ఈలోగానే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీవర్షాలు, బుడమేరుకు సంభవించిన వరదల కారణంగా పంట పొలాలు నీటిమునిగి దెబ్బతిన్నాయి. జిల్లాలో సుమారుగా 50వేల హెక్టార్లలో పంటను రైతులు కోల్పోయారు. ప్రస్తుతం దివిసీమలోని కేఈబీ కాలువ పరిధిలో 463 పనులకు రూ.330 కోట్ల అంచనాలతో పనులు చేయాలని సాగునీటి సంఘాల ద్వారా ప్రతిపాదనలు వెళ్లాయి. జిల్లాలోని మిగిలిన కాలువల కింద పనులకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

ఫిబ్రవరి 15 వరకు కాలువలకు నీటి విడుదల

కృష్ణాడెల్టా పరిధిలోని కాలువ శివారు ప్రాంతాల్లోని నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం తదితర మండలాల్లో ఇంకా వరిపైరు పొట్ట దశలో ఉంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటకు నీటి విడుదలను జనవరి నెలాఖరునాటికి నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. శివారు ప్రాంతాల్లో ఇంకా వరిసాగులో ఉన్న నేపథ్యంలో ఫిబ్రవరి 15వ తేదీ వరకు బందరు, కేఈబీ కాలువలకు నీటిని విడుదల చేయాలని సాగునీటి సంఘాల అధ్యక్షులు కోరడంతో పొడిగించారు. సాగునీటితో పాటు జిల్లాలోని 378 తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని నిర్ణయించారు.

అంచనాల దశ దాటని అవుట్‌ఫాల్ స్లూయిస్‌గేట్ల నిర్మాణం

అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో ప్రధాన డ్రెయిన్‌లపై అవుట్‌ఫాల్ స్లూయిస్‌గేట్లు ఏడు ఉన్నాయి. పొలాల నుంచి మురుగు నీరు సముద్రంలోకి వెళ్లేందుకు, సముద్రపుపోటు సమయంలో ఉప్పునీరు డ్రెయిన్‌ల ద్వారా పొలాల్లోకి చొచ్చుకు రాకుండా ఉండేలా వీటిని నిర్మించారు. పాలకాయతిప్ప, హంసలదీవి, నాలి, పాతఉపకాలి, గుల్లలమోద తదితర ప్రాంతాల్లోని అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు పూర్తిగా పాడైపోయాయి. వీటిని పునఃనిర్మాణం చేయాలని కొన్నేళ్లుగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఉప్పునీరు డ్రెయినేజీల ద్వారా పంట పొలాల్లోకి చొచ్చుకురావడంతో గత మూడేళ్లుగా కోడూరు మండలంలోని ఊటగుండం, హంసలదీవి, దింటిమెరక తదితర ప్రాంతాల్లో రైతులు వరిపంటను సాగు చేయలేదు. గుడివాడ డ్రైనేజీ విభాగం కార్యాలయంలో గత నాలుగు సంవత్సరాలుగా ఈ అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు సంబంధించిన అంచనాలు తయారవుతూనే ఉన్నాయి. కృత్తివెన్ను మండలం పెదలంక డ్రెయిన్ 3.23 కిలోమీటరు వద్ద అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి రూ.40 కోట్లతో అంచనాలు రూపొందించారు. టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయింది. కానీ ఈ పనులను ఇంత వరకు చేపట్టలేదు.

ఇసుక లారీలతో రోడ్లు ఛిద్రం

(5వ పేజీ తరువాయి)

లారీలు రాకుండా ఆ గ్రామ పంచాయతీ నిషేధం విధించింది. రొయ్యూరులో క్వారీ, స్టాక్‌యార్డు ఉన్నప్పటికీ ఆ గ్రామంలోకి ఇసుక లారీలను ఆ గ్రామపంచాయతీ రాకుండా నిషేధం విధించటంతో ఆ లారీలు తోట్లవల్లూరు వస్తున్నాయి. తోట్లవల్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మూడు కిలోమీటర్ల పొడవునా పూర్తిగా పాడైపోయింది. ఇప్పుడు దీనికి రూ.40 లక్షలు ఖర్చు పెట్టి ప్యాచ్ వర్కులను చేయిస్తున్నారు.

పరిమితిదాటి లోడింగ్

పదిటైర్ల లారీ సామర్థ్యం 18 టన్నులు మాత్రమే. పన్నెండు టైర్ల లారీ సామర్థ్యం సుమారు 20 టన్నులు. కాని పదిటైర్ల లారీలోనే 40 టన్నుల ఇసుకను, పన్నెండు టైర్ల లారీలో 45 టన్నుల ఇసుకను కొండలా నింపి మచిలీపట్నం పోర్టుకు పంపుతున్నారు. లారీ సామర్థ్యానికి మించి 22 టన్నుల ఇసుక అదనంగా లోడింగ్ చేసుకు వస్తున్నా నియంత్రించే వారు. దీంతో రహదారులకు కోట్లాది రూపాయల నష్టం జరుగుతోంది. ప్రతిరోజు వందల లారీలు నిత్యం కరకట్టపై కిలోమీటర్ల మేర ప్రయాణించి తోట్లవల్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా మచిలీపట్నం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో తోట్లవల్లూరు కేఈబీ కెనాల్‌పై వంతెన అప్రోచ్ రోడ్డు కుంగిపోయింది. రిటైనింగ్‌వాల్ కూలిపోయింది.

20 టన్నులు దాటితే రోడ్లు దెబ్బతింటాయి

ఆర్‌అండ్‌బీ రోడ్లు 20 టన్నుల బరువు వాహనాలను మాత్రమే తట్టుకోగలవు. ఆపై అధిక బరువు గల వాహనాలు తిరిగితే రోడ్లు పాడైపోతాయి. 40 టన్నులకు పైగా బరువుతో ఇసుక లారీలు తిరగటం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయి.

-మల్లికార్జున్, ఆర్‌అండ్‌బీ ఏఈ

బియ్యం బీర్..!

(5వ పేజీ తరువాయి)

తెలిసినా రైతుల వద్ద భారీ ఎత్తున ప్రైవేట్ ధాన్యాన్ని వ్యాపారులు కొన్నారు. ఇలా కొన్న బియ్యాన్ని తమ సొంత మిల్లుల్లో కొందరు, బయట మిల్లుల్లో మరి కొందరు ఆడించారు. ఇలా ఆడించిన బియ్యాన్ని ఓ బీరు ఫ్యాక్టరీకి తరలించినట్టు తెలుస్తోంది. రంగు మారిన బియ్యం బాగా తడిచి ఉండటం వల్ల బీరు తయారీకి ఉపయోగపడింది. ఈ ధాన్యాన్ని నిల్వబెట్టి, పులియబెట్టి బీరు అసెన్స్ బయటకు తీశారు.

గత ఆగస్టులోనూ..

గత ఆగస్టులో కురిసిన భారీ వర్షాలు, బుడమేరు వరద కారణంగా ఉమ్మడి కృష్ణాలో పంట నష్టం ఏర్పడింది. తడిసిన బియ్యాన్ని కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయించుకుంది. వైసీపీ హయాంలో మాదిరిగా కాకుండా, ఎట్టి పరిస్థితుల్లో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనాల్సిందేనని టార్గెట్లు విధించింది. పూర్తిగా కొనాల్సిందేనని ఆదేశించింది. అయినప్పటికీ మధ్య దళారీలు కీలకపాత్ర పోషించి రైతుల నుంచి తక్కువ ధరకే ఆ బియ్యాన్ని కొన్నారు. ఆ తర్వాత ప్రైవేట్ వ్యాపారులకు సమకూర్చారు. వారేమో సొంత, బయట మిల్లుల్లో ఆడించి, రంగుమారిన బియ్యాన్ని బీరు ఫ్యాక్టరీకి పంపించారు. ఇలా రెండో దఫా కూడా భారీగా ప్రైవేట్ ధాన్యాన్ని కొని వ్యాపారులు లబ్ధిపొందారు. రంగుమారిన బియ్యం పెద్ద మొత్తంలో రావటం వల్ల సదరు బీరు ఫ్యాక్టరీ కూడా డిమాండ్‌కు తగిన విధంగా కొనలేకపోయింది. దీంతో చాలామంది వ్యాపారుల వద్ద రంగు మారిన ధాన్యం మిగిలి ఉండిపోయింది.



బీరు ఫ్యాక్టరీకి తరలిన రంగుమారిన బియ్యం శాంపిల్స్

ఆర్థిక భారాన్ని పోగొట్టుకునేందుకు..

ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రభుత్వం టార్గెట్లు విధించింది. ఈ క్రమంలో రైతుల నుంచి ధాన్యం కొన్న కొందరు ప్రైవేట్ వ్యాపారులు.. రైతుల ముసుగులో వాటిని కొనుగోలు కేంద్రాలకు విక్రయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్ర యించిన లోడులో కొన్ని రంగు మారిన బియ్యం బస్తాలను కూడా వేసి పంపారు. మిల్లర్ల దగ్గరకు వెళ్లాక బియ్యం ఆడించి సార్టెక్స్ చేసేటపుడు రంగుమారిన బియ్యం కనిపించాయి. ఇలాంటి బియ్యాన్ని వేరు చేశారు. వందల టన్నులకొద్దీ రంగు మారిన బియ్యం రావటంతో ఆ బియ్యం స్థానంలో తెల్ల బియ్యం వేసి ఇవ్వాల్సి వచ్చింది. ఇలా చాలామంది మిల్లర్లు ఆర్థిక భారాన్ని చవిచూశారు. తొలుత లోడు తీసుకునేటపుడు తేమశాతాన్ని మాత్రమే చూసిన మిల్లర్లు లోడులో ఎక్కడో మధ్యభాగంలో వేసిన రంగు మారిన ధాన్యం బస్తాలను కనిపెట్టలేకపోయారు. ఇలా వేరు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు రూ.20కు బీరు ఫ్యాక్టరీకి విక్రయించారు. ఇలా వివిధ రూపాల్లో పీడీఎస్ బియ్యం బీరు ఫ్యాక్టరీకి చేరింది. ప్రకృతి విపత్తులు సంభవించి రైతులు కంట కన్నీరు పెట్టుకుంటుంటే, ప్రైవేట్ వ్యాపారులకు మాత్రం బీరు ఫ్యాక్టరీల పుణ్యమా అని లాభాల పంట పండింది. పీడీఎస్ బియ్యాన్ని కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు కొంటున్నారు. తక్కువ ధరకు కొని, మిల్లు ఆడించి బియ్యం తీయటం ద్వారా ప్రైవేట్ వ్యాపారులు బాగానే లాభపడుతున్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 500	

వాటర్ కూలర్ వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : మా ఊరికి.. మాసేవ ద్వారా పెరికీడు సచివాలయానికి వాటర్‌కూలర్‌ను ముచ్చర్ల గిరిబాబు వితరణ చేశారు. పెరికీడు సచివాలయ కార్యదర్శి మాదు రామకృష్ణకు వాటర్‌కూలర్‌ను బుధవారం అందజేశారు. తన తల్లిదండ్రులు ముచ్చర్ల గంగాధరరావు, మల్లేశ్వరిల జ్ఞాపకార్థం వివిధ పనులపై వచ్చే ప్రజలకు వేసవిలో చల్లటి నీరందించేందుకు గాను ఈ వాటర్‌కూలర్‌ను అందజేసినట్లు దాత గిరిబాబు వివరించారు.



భారీ వాహనాల రాకపోకలతో

రహదారులు ధ్వంసం!

- ఓవర్‌లోడుతో వస్తున్న ఇసుక టిప్పర్లు
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు
- స్పీడు బ్రేకర్లు, గుంతలవద్ద టిప్పర్లపై నుంచి ఇసుక పడి తరచూ ప్రమాదాలు

(ఉయ్యూరు/ కంకిపాడు - ఆంధ్రజ్యోతి)

అధిక లోడుతో వస్తున్న ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్ల నుంచి ఇసుక రోడ్డుమీద పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. తోట్లవల్లూరు, కంకిపాడు మండలాల పరిధిలో ఇసుక క్వారీల నుంచి 10టైర్లు, అంతకుమించిన సామర్థ్యం కలిగిన టిప్పర్లు బాడీపె కంటూనే కాకుండా క్యాబిన్‌పైన కూడాఎత్తుగా నింపుకుని


తోట్లవల్లూరు క్వారీ నుంచి ఉయ్యూరుకు క్యాబిన్‌పై ఇసుక నింపుకుని అధిక లోడుతో వస్తున్న టిప్పర్

యథేచ్ఛగా రవాణా చేస్తుండగా ట్రాక్టర్లు ట్రక్కుకు పైన ఎత్తుగా నింపుకుని వస్తున్నాయి. దీంతో రోడ్లు ధ్వంస మవడమే కాక రోడ్లపైన గుంతలు, స్పీడు బ్రేకర్ల వద్ద టిప్పర్లు, ట్రాక్టర్లనుంచి ఇసుక రోడ్డుపై పడి ద్విచక్ర వాహనాలు జారీపడి నడిపేవారు గాయాల పాలవుతున్నారు. ఉయ్యూరు-తోట్లవల్లూరు రోడ్డులో స్పీడు బ్రేకర్ల వద్ద, మంటాడ రోడ్డులో కేసీపీ కర్మాగారం సమీపాన గుంతలు, స్పీడు బ్రేకర్లవద్ద టిప్పర్లు, ట్రాక్టర్ల నుంచి ఇసుక కిందపడి ప్రమాదాలకు కారణమవుతుంది. టిప్పర్ల బాడీతో పాటు క్యాబిన్‌పైన కూడా ఇసుక నింపుకుని వస్తున్నా రవాణా శాఖ, పోలీసులు పట్టించుకోపోవడం పట్ల సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓవర్‌లోడు ఇసుక అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● తోట్లవల్లూరు మండలంలోని రొయ్యూరు, వల్లూరు పాలెం క్వారీల నుంచి ఇసుక రవాణా చేస్తున్న వాహనాలు


రొయ్యూరు - గొడవర్రు మీదుగా అధిక లోడుతో కంకిపాడు వస్తున్న టిప్పర్

రొయ్యూరు - గొడవర్రు మీదుగా కంకిపాడు చేరాల్సిందే. దీంతో మోతాదుకు మించి ఓవర్ లోడు వేయడంతో రోడ్డు ధ్వంస మవుతుంది. ఒక్కో లారీలో సుమారు 20 టన్నుల నుంచి 25 టన్నుల లోడుతో వెళ్లాల్సిన వాహనాలు సుమారు 50 టన్నుల పైబడి లోడుతో వెళ్తుండటంతో రోడ్డు మూడునాళ్ల ముచ్చటగానే మిగిలిపోతుందని కంకిపాడు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

కొనసాగుతున్న చెత్త వాహనాల డ్రైవర్ల సమ్మె

పెనమలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీ తడిపొడి చెత్త సేకరించే వ్యాన్ డ్రైవర్‌లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవటంతో ఈ నెల 10 నుంచి 42 మంది కార్మికులు సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులు తమ నిరసనను కొనసా గించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవటం దారుణమన్నారు. ఫిబ్రవరిలో సమస్యలు పరిష్కారం కాకపోతే నాలుగు ఊళ్లలో ఉన్న కార్మికులను కలుపుకుని సమ్మెలోకి వెళతామన్నారు. సీఐటీయూ నాయకులు మస్తాన్‌వలీ, సీపీఎం మండల కార్యదర్శి యస్‌కె ఖాసీం, వై.సరళ, ఉప్పాడ త్రిమూర్తులు, ఏడుకొండలు, దుర్గారావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాలయేసు జెండాను ఆవిష్కరించిన ఫాదర్ మువ్వల ప్రసాద్

బాలయేసు దీవెనలతో సమాజానికి శాంతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మానవాళి ప్రేమ, శాంతితో జీవించేలా బాలయేసు దీవెనలు అవసరమని విజయవాడ మేత్రాసన ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. పెరికీడులో బుధవారం అద్భుత బాలయేసు మహోత్సవాల ప్రారంభం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. దివ్య బలిపూజ సమర్పించి నవదిన ప్రార్థనలతో మహోత్సవాలను ప్రారంభించారు. విశ్వాసులకు బాలయేసు ప్రార్థనలతో మేలు జరుగుతుందన్నారు. విచారణ కర్త ఫాదర్ జోసఫ్‌తంబి ఆధ్వర్యంలో జెఎంజె సిస్టర్ అంథోనమ్మ పర్యవేక్షణలో బాలయేసు బోధనలను గానం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిసె రాజు, వెలగపల్లి ప్రదీప్, ప్రత్తిపాటి ఏసుపాదం, పొట్ల సురేష్, కాంతారావు, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

ఉయ్యూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు-కాటూరు రోడ్డులో హిందూ శ్మశానవాటిక పక్కన చెరువులో బుధవారం మృతదేహం లభ్యమైంది. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం శ్మశాన వాటిక పక్క చెరువులో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేర ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలుపలికి తీయించి అతని ఆచూకి సేకరించారు. పమిడిముక్కల మండలం తాడంకికి చెందిన చలపాటి ప్రకాశ్‌బాబుగా (45) గుర్తించారు. అతను ఉయ్యూరులో చిత్తుకాగితాలు ఏరుకుంటూ రిక్షా తొక్కుతూ ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

గన్నవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూ లంగా తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయటంలో జాప్యం చేయటం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మందా వేణు అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నంలో హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు వేల గొంతుల సంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం ప్రచారం నిర్వహించారు.

వీహెచ్‌పీ ద్వారా సేవలు విస్తృతం చేయాలి


బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సతీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వీహెచ్‌పీ (విశ్వ హిందూ పరిషత్) ద్వారా సేవలను మరింత విస్తృతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సూచించారు. విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని బుధవారం వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల గన్నవరంలో నిర్వహించిన హిందూ శంఖారావం సభ విజయవం తమయ్యేలా కృషి చేసినందుకు పుట్టగుంటను అభినందించారు. హిందూ ధర్మ వైశిష్ట్యాన్ని, సంస్కృతీ సంప్రదాయాల్లోని విజ్ఞానాన్ని ప్రస్తుత యువతకు తెలియ జెప్పేలా కార్యాచరణ చేయాలని సూచించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరిని పుట్టగుంట మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.



గోవులకు సామూహిక సీమంతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు తరాలకు మన ఆచారాలు, సంప్రదాయాలు తెలియజేసేలా రంగన్న గూడెంలో గోవులకు సామూహిక సీమంతం నిర్వహించారు. రంగన్నగూడెంలో బుధవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరం ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఆళ్ల మణికృష్ణ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు గోవులకు సీమంతం నిర్వహించారు. ముత్తయిదువులందరూ కలిసి పూల దండలతో గోవులను అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల జ్యోతి, కొల్లి నాగలక్ష్మి, పూర్ణ, కసుకుర్తి పద్మ, మొవ్వా రత్నకుమారి, మొక్కపాటి అచ్చమాంబ, ద్రోణవల్లి నాగమణి, తదితరులు పాల్గొన్నారు. కసుకుర్తి అర్జునరావు, పాల సొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు, మొక్కపాటి సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఉయ్యూరును ముంచెత్తిన మంచు

ఉయ్యూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు లో బుధవారం దట్టంగా మంచుకమ్ముకోవడంతో వాహనాలు నడిపేవారు ఇబ్బందికి గురయ్యారు. ఉయ్యూరు, పరిసర గ్రామాల పరిధిలో వేకువజామునుంచి ఉదయం 10 గంటల వరకు మంచు దుప్పటి కప్పినట్లు కన్పించడంతో ఇళ్లనుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడ్డారు. రోడ్డుపై మనిషికి మనిషి కన్పించనంతగా పొగమంచు కురియడంతో ఎదురు వచ్చే వాహనాలు కన్పించక వాహనాలు నడిపే వారికి అసౌకర్యం కలిగింది. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై మండల పరిధిలో మంచు కమ్ముకోగా బస్సులు, ఇతర వాహనాలు నడిపేందుకు డ్రైవర్లు ఇబ్బంది పడ్డారు.


కార్పొరేటర్‌లతో ఎమ్మెల్యే సుజనాచౌదరి

సమన్వయంతో ముందుకు వెళదాం

పెనమలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజల అవసరాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ అందరం కలసి సమన్వయంతో ముందుకు వెళదామని పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే యలమంచిలి సుజనాచౌదరి అన్నారు. తాడిగడపలో ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ, జనసేన, బీజేపీ పశ్చిమ కార్పొరేటర్‌లు, ఇతర ముఖ్య నేతలతో బుధవారం సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముం దు ఇచ్చిన హామీలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. అందరం సమన్వయంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో విసిగిపోయిన ప్రజలు ఎన్డీయే కూటమికి పట్టం కట్టారన్నారు. ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకుని అధికారులతో కలసి సమన్వయంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటమే తన లక్ష్యమని సుజనాచౌదరి తెలిపారు. కార్పొరేటర్‌లు మైలవరపు దుర్గారావు, బుల్లా విజయకుమార్, గుడివాడ నరేంద్ర రాఘవ, మరుపిళ్ల రాజేష్, మహాదేవు అప్పారావు, అత్తులూరి ఆదిలక్ష్మీ, పెదబాబు పాల్గొన్నారు.

చదరంగం అభివృద్ధిలో రత్నారావు పాత్ర ఎనలేనిది


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న బసవేశ్వరరావు

గన్నవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లా చదరంగం ఆటను అభివృద్ధి చేయటంలో ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమి వ్యవస్థాపకుడు బొబ్బా రత్నారావు ఎనలేని కృషి చేశారని కృష్ణా యూనివర్సిటీ హెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. మండలంలోని ముస్తాబాదలో బుధవారం చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ వయసు మీద పడిన తరువాత కూడా చదరంగంపై ఉన్న ఆసక్తితో ఎక్కడ పోటీలు జరిగితే అక్కడకు వెళ్ళేవారని చెప్పారు. జిల్లాలో చెస్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేశారన్నారు. ఇటీవల రత్నారావు మృతి చెందగా ఆయన కుమారుడు చెస్ అంతర్జాతీయ కోచ్, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వీఆర్ బొబ్బా అదే స్ఫూర్తిని కొనసాగించటం అభినందనీయమన్నారు. 92 మంది పోటీలకు హాజరైనట్లు తెలిపారు. అకాడమి అధ్యక్షురాలు బొబ్బా రచన, విప్రో కంపెనీ ప్రతినిధి బి.హస్మిత, కోనేరు హంపి తండ్రి కోనేరు అశోక్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

గుణదల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): లారీ అతివేగంగా వచ్చి స్కూటీపై వెళుతున్న వారిని వెనుకనుంచి ఢీ కొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయిన ఘటన మహానాడు జంక్షన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. జక్కుల వినయ్(19), జీవన్(22), గోపి (26)లు రామవరప్పాడులో నివాసం ఉంటున్నారు. వీరు ముగ్గురు బెంజిసర్కిల్ వద్దగల ఓ షాపింగ్‌మాల్ నందుగల రెస్టారెంట్లో చెఫ్‌లుగా పనిచేసి జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి ముగ్గురూ ఒకే ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మహానాడు జంక్షన్ వద్దకు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న స్కూటీని వెనుక నుంచి అతివేగంగా వస్తున్న ఐచర్ లారీ ఢీకొట్టింది. దీంతో వాహనం నడుపుతున్న గోపి మీదనుంచి లారీ టైరు వెళ్ళడంతో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి.

పశుపోషకులను ప్రోత్సహించేందుకు వైద్యశిబిరాలు

గన్నవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పశుపోషకులను ప్రోత్సహించేందుకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ మాదల రోహిణి అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాదల రోహిణి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పశువైద్య సేవలను సద్వి నియోగించుకోవాలని సూచించారు. ఏడీఏ డాక్టర్ ఎంవీ బాలకృష్ణరావు మాట్లాడుతూ, వైద్య శిబిరాలకు విశేషస్పందన వస్తుందన్నారు. డాక్టర్స్ మేరీ వైడూర్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. గొల్లనపల్లిలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉపసర్పంచ్ యనమదల సుబ్బారావు పలగాని మధు, కొలుసు కోటేశ్వరరావు, డాక్టర్ రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ఉంగుటూరు : పశువులకొచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి సరైన వైద్యసేవలందించటంద్వారా పశుపోషణ లాభసాటిగా వుంటుందని వేంపాడు సర్పంచ్ నాగనబోయిన శివనాగబాబు అన్నారు. రాష్ట్రప్రభుత్వం, పశుసంవర్ధకశాఖ సౌజన్యంతో ఇందుపల్లి, ఆత్కూరు పశువైద్యాధికారులు డాక్టర్ జి.సుధీర్‌బాబు, డాక్టర్ ఎన్.నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వేంపాడు, ఆత్కూరు గ్రామాల్లో పశుఆరోగ్యశిబిరాలు నిర్వహించారు. ఈ పశుఆరోగ్యశిబిరాల్లో మానికొండ, తరిగొప్పుల, పెదఅవుటపల్లి గ్రామీణపశువైద్యశాలల లైవ్‌స్టాక్‌ఆఫీసర్లు ఎస్.శ్రీనివాసు, ఆర్‌వీ ఫణికుమార్, ఏ.వెంకట్రామయ్య, పశుసంవర్ధకశాఖ సిబ్బంది హుస్సేన్, శివ, నాగబాబు, ఆశ, మోనా, రఘు స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పశువుల ఆరోగ్యంపై సూచనలను పాటిస్తూ తగు విధంగా మందులు వాడాలని డాక్టర్ దుర్గాభవాని రైతులకు సూచించారు. బండారుగూడెంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.





బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి

వచ్చేనెల 3 నుంచి బ్రహ్మోత్సవాలు

● పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లను, కరపత్రాలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన్ను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 3న కల్యాణం, 4న రథోత్సవం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈసారి ప్రత్యేక ఆకర్షణగా 6న స్వామివారి కోనేటిలో కల్యాణ మూర్తుల తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఘనాపాటి నౌడరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, సీనియర్ అసిస్టెంట్లు బర్మా ప్రసాద్, తోట చెన్నకేశవ, కంప్యూటర్ ఆపరేటర్ పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.

దుర్గగుడి ప్రధాన అర్చకుడు

బదరీనాథ్ బాబు కన్నుమూత



వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రధాన అర్చకుడు లింగంభొట్ల బదరీనాథ్ బాబు (65) గుండెపోటుతో మృతిచెందారు. కామకోటినగర్‌లోని అరవింద వీధిలో తన నివాసంలో బుధవారం ఉదయం నిద్రనుంచి స్నానానికి వెళ్లబోతుండగా దడవచ్చి పడిపోయారని, తరువాత శ్వాస ఆడకపోవటంతో కన్నుమూసినట్టు తెలిసింది. బదరినాథ్ బాబు దేవస్థానంలో సాధారణ అర్చకుడిగా 1980లో ప్రవేశించారు. అక్కడి నుంచి 20 09లో ప్రధాన అర్చకుడిగా నియామకం పొందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె. ఈ ఏడాది మేలో పదవీ విరమణ చేయనున్నారు. ఇంతలోనే ఆకస్మికంగా మృతిచెందారు. 6 నెలల క్రితం ఆయనకు వారసత్వపు హక్కులను కల్పిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మృతి వార్త తెలుసుకున్న అర్చక, ఉద్యోగుల బృందం సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంతిమయాత్రలో పలువురు అర్చకులు పాల్గొన్నారు. శాస్త్రవిహితంగా అంత్యక్రియలు జరిపారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దుర్గగుడి ఈవో, గురువారం నుంచి ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకోనున్న రామచంద్ర మోహన్, తాజా మాజీ ఈవో కేఎస్ రామారావు, పలువురు అధికారులు బదరినాథ్ బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మంత్రి రామనారాయణ రెడ్డి నివాళి

బదరీనాథ్ బాబు అకాల మరణం ఎంతో బాధాకరమని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దుర్గమ్మ అలంకరణ, ఆచార వ్యవహారాల్లో అపార అనుభవంతో సేవలందించారన్నారు. బదరీనాథ్ బాబు కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

త్వరలో లాయర్లకు రక్షణ చట్టం!



అమల్లోకి రానున్న ముసాయిదా బిల్లుతో న్యాయవాదులకు భద్రత, సంక్షేమం

- సిద్ధం చేసిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)
- అధ్యయనం చేసిన బెజవాడ బార్ కౌన్సిల్

విజయవాడ లీగల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): న్యాయం పక్కన నిలబడినప్పుడో, అన్యాయంపై గట్టిగా వాదనలు వినిపించేటపుడో తమ పుట్టి మునిగిపోతోందనుకున్నపుడు న్యాయవాదులపై దాడులు జరుగుతున్న పరిస్థితి! చట్టాలకు లోబడి బాధితులకు అండగా వాదనలు వినిపించే న్యాయవాదులకే రక్షణ లేనపుడు ఆ చట్టాలే అపహాస్యం పాలౌతాయి. దేశ వ్యాప్తంగా న్యాయవాద సంఘాల పోరాట ఫలితంగా అతి త్వరలో న్యాయవాదులకు మంచి రోజులు రానున్నాయి. న్యాయవాదులపై దాడులకు పాల్పడకుండా వారి రక్షణ, సంక్షేమానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) 2021లో ముసాయిదా బిల్లును సిద్ధం చేసింది. ఈ బిల్లు కేంద్ర కేబినెట్‌లో ప్రవేశపెట్టి, పార్లమెంట్‌లో ఆమోదం పొందాక చట్టంగా రూపు దిద్దుకొంటుంది. ఈ బిల్లును బెజవాడ బార్ కౌన్సిల్ అధ్యయనం చేస్తోంది. న్యాయవాదులకు నూరుశాతం రక్షణ కల్పించేలా ఉందని అభిప్రాయపడుతున్నారు. బీసీఐ సిద్ధం చేసిన బిల్లును ఒకసారి పరిశీలిస్తే ఐదు అంశాలు పరిగణలోని తీసుకొని రూపొందించినట్టు తెలుస్తోంది. ఎవరైనా సరే న్యాయవాదులను భయభ్రాంతులకు గురి చేయకూడదు. మానసికంగా, భౌతికంగా హింసించకూడదు. వివిధ రూపాల్లో ఒత్తిడి తేకూడదు. దాడులకు తెగపడకూడదు. తప్పుడు కేసులు పెట్టకూడదు. ఈ ఐదు కీలకాంశాలను దృష్టిలో పెట్టుకుని న్యాయవాదుల రక్షణ బిల్లు - 2021కు ముందడుగు పడింది.



న్యాయవాదుల బిల్లులోని ముఖ్యాంశాలు

న్యాయవాదులపై ఎవరైనా నేరాలకు పాల్పడితే 6 నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలుశిక్ష, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించవచ్చని తెలిపింది. న్యాయవాదులపై విచారణకు డీఎస్పీ లేక ఏసీపీ పై స్థాయి అధికారులే విచారణ చేయాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన 30 రోజుల్లోపు విచారణ పూర్తిచేసి చార్జిషీటు దాఖలు చేయాలని బిల్లులో పేర్కొంది. న్యాయవాదులపై పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టాలంటే చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అనుమతి తప్పనిసరని, న్యాయవాదులపై చేసే ఆరోపణలకు కానీ, ప్రైవేటు వ్యక్తులపై న్యాయవాదులు చేసే ఆరోపణలకు కానీ 'రెడ్రసల్' (పరిష్కార కమిటీ) కమిటీకి నివేదించాలి. ఈ కమిటీలు జిల్లా కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు స్థాయిలో ఉం టాయన్నారు. ప్రజలు - న్యాయవాదుల వివాదాలను ఈ కమిటీల ద్వా రానే పరిష్కరించుకోవాలి. ఈ బిల్లు ప్రకారం న్యాయవాదికి ఊహించని నష్టం జరిగినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి నెలకు రూ.15వేలు తక్కువ లేకుండా ఆర్థిక సహకారం అందజేస్తాయి. దీన్నే బీసీఐ ముసాయిదా బిల్లులో 'సోషల్ సెక్యూరిటీ' కింద పరిగణించింది. ఈ బిల్లుపై పలువురు సీనియర్ న్యాయవాదులు తమ అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

న్యాయవాదులపై దాడులుండవు
వి.గురునాథం, బెజవాడ బార్ మాజీ అధ్యక్షుడు



ఈ బిల్లు కేంద్ర కేబినెట్ ఆమోదం పొంది పార్లమెంట్‌లో చట్టరూపం దాల్చితే దేశంలోని ఏ న్యాయవాదిపైనా దాడులు జరగవు. ఇటీవల పోలీసులు న్యాయవాదులపై తప్పుడు కేసులు పెడుతున్నారు. వాటిని నియంత్రించేలా బిల్లులో రక్షణ కల్పించారు. దీంతో పోలీసులు న్యాయవాదులపై తప్పుడు కేసులు పెట్టేందుకు వెనుకాడతారు.

ఈ చట్టం ఎంతో ఉపయోగకరం
అరిగెల శివరాంప్రసాద్ (రాజా), బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి



ఈ రక్షణ చట్టం అమల్లోకి వస్తే న్యాయవాదులపై దాడులు కానీ, బెదిరింపులు కానీ, తప్పుడు కేసులు కానీ, హత్యలు కానీ జరగవు. న్యాయాన్ని పరిరక్షించే న్యాయవాదులకే రక్షణ లేకపోతే ఎలా? వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమలులోకి తెస్తే ఎంతోమంది న్యాయవాదులకు ఉపయోగకరం.

బిల్లు త్వరగా చట్టరూపంలోకి తేవాలి
సూరాబత్తుల మల్లేశ్వరరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్



న్యాయవాదుల రక్షణ, సంక్షేమానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తయారుచేసిన ఈ బిల్లు ఎంత త్వరగా చట్టరూపం దాల్చితే అంత త్వరగా న్యాయవాదులు రక్షించబడతారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు, హత్యలు పెరిగాయి.

న్యాయవాదులపై తప్పుడు కేసులుండవు
వెన్నా కళ్యాణ్ చక్రవర్తి, హైకోర్టు న్యాయవాది



న్యాయవాదులపై రక్షణ చట్టం అమల్లోకి వస్తే భవిష్యత్తులో న్యాయవాదులపై తప్పుడు కేసులుండవు. చాలారాష్ట్రాల్లో న్యాయవాదులు ఎప్పటినుంచో ఆందోళనలు చేస్తున్నారు. ఇప్పటికే ఆలస్యమైంది. ముసాయిదాను పరిశీలించగా న్యాయవాదులకు పూర్తి అండగా నిలబడుతోందని భావించాం.

వృత్తిలో ధైర్యంగా ముందుకెళొచ్చు
సప్పా రమేష్, ఐలూ న్యాయవాది



ఈ రక్షణ చట్టం అమల్లోకి వస్తే న్యాయవాదులు తమ వృత్తిలో ధైర్యంగా ముందుకెళ్తారు. తమ వృత్తిలో క్లయింట్ల నుంచి, పోలీసుల నుంచి ఒత్తిడి, బెదిరింపులు ఎక్కువైతే ప్రశాంతంగా ఎలా ఉంటారు. పోరాటాల ఫలితంగా వచ్చిన ముసాయిదా బిల్లును స్వాగతిస్తున్నాం. త్వరలో చట్టం కాబోతుంది.

బిల్లుతోనే రక్షణ, సంక్షేమం
చేకూరి శ్రీపతి, మాజీ బార్ అధ్యక్షుడు



న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి వస్తే కేవలం రక్షణ మాత్రమే కాకుండా సంక్షేమం కూడా అమలవుతుంది. న్యాయవాదులు ప్రమాదాల బారిన పడినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలకు రూ.15వేలకు తక్కువ కాకుండా ఇవ్వాలని బిల్లులో పెట్టడం ముదావహం.

దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు
పడవల ఏడుకొండలు, సీనియర్ న్యాయవాది



న్యాయవాదులపై దాడులకు పాల్పడితే కఠినంగా శిక్షించడమే బిల్లు ముఖ్యోద్దేశం. లేదంటే ఎవరుపడితే వారు, పోలీసులు, న్యాయవాదులపై దాడులకు తెగబడుతుంటే ఎలా. న్యాయవాదులు ఎన్నాళ్లగానో కోరుకొంటున్న చట్టమిది.

ఈ చట్టం త్వరగా అమల్లోకి రావాలి
బొమ్మసాని రవి, బార్ మాజీ ప్రధాన కార్యదర్శి



దేశంలోని అనేక రాష్ట్రాల్లోని న్యాయవాదులు ఎన్నాళ్లగానో కోరుకొంటున్న న్యాయవాదుల రక్షణ చట్టం ఇప్పటికైనా బీసీఐ ముసాయిదా బిల్లుతో బీజం పడింది. త్వరలోనే బిల్లు చట్టరూపం దాల్చితే న్యాయవాదులకు రక్షణ ఉంటుందనేది నిర్వివాదాంశం.

మరో నగరవనానికి నాంది

● ఆధ్యాత్మిక కేంద్రం వేదాద్రి వద్ద ఏర్పాటు ● 125 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు ● కొత్తూరు తాడేపల్లి 'వనం' విస్తరణకు ప్రణాళికలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా ప్రజలను కనువిందు చేయడానికి, స్వచ్ఛమైన పర్యావరణాన్ని పంచడానికి మరో నగరవనం తయారు కాబోతోంది. జిల్లాకు శివారున, తెలంగాణ నుంచి వచ్చే సందర్శకులకు స్వాగతం పలికేలా ముస్తాబు కాబోతోంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వేదాద్రికి 5 కిలోమీటర్ల దూరంలో కొత్త నగరవనాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రతిపాదనలను కూడా తయారు చేసి అటవీ శాఖ ప్రధాన కార్యాలయానికి పంపారు. జిల్లాలో విజయవాడకు సమీపంలో మూడు నగరవనాలున్నాయి. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి వద్ద ఒక నగరవనం ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం ఇందులోకి ప్రజలను అనుమతించారు. అలాగే విజయవాడ-గుంటూరు జాతీయ రహదారికి పక్కన బందరు కాల్వ చెంతనే ఒక నగరవనాన్ని తయారు చేశారు. ఇది ఫొటోషూట్లకు మాత్రమే ఉపయోగపడుతుంది. చాలాతక్కువ సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. తాజాగా మూలపాడులో సీతాకోకచిలకల పార్కుతో కొత్త నగరవనాన్ని అందుబాటులోకి తెచ్చారు. సంక్రాంతి సమయంలో జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు సందడి చేశారు. రోజురోజుకు ఈ సంఖ్య పెరుగుతోంది. దీంతో జిల్లాకు శివారున ఉన్న ప్రాంతంలో ఒక నగరవనాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అధికారులకు సూచించారు. 125 హెక్టార్లలో ఏర్పాటు చేయాలన్న యోచనలో అధికారులున్నారు. ఇందులో నవ (తొమ్మిది) వనాలను (థీమ్ పార్కులు) ప్రజలకు చూపించాలని భావిస్తున్నారు. అటవీ ఉన్నతాధికారులు ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత నిధులు విడుదలవ్వగానే పనులను ప్రారంభిస్తామని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే నక్షత్రవనంతోపాటు మరొ కొన్ని వనాలను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించారు. మొత్తం తొమ్మిది వనాలు ఇందులో కొలువుదీరబోతున్నాయి.



కొత్తూరు తాడేపల్లిలోని నగరవనం





2015లో చంద్రబాబు ఆవిష్కరించిన శిలాఫలకం

ఇవీ థీమ్ పార్కులు

నగరవనాల్లో కొత్తగా రాశివనం, నక్షత్రవనం, పంచటి వనాలను ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. వేదాల ప్రకారం మనకు 12 రాశులు, 27 నక్షత్రాలున్నాయి. ఒక్కో రాశికి ఒక్కోవృక్షం సంకేతంగా ఉంది. అలాగే ఒక్కో నక్షత్రాన్ని ఒక్కో వృక్షం ఉంది. ఇలా 12 రాశులకు మొక్కలతో రాశివనం, 27 నక్షత్రాలకు మొక్కలతో నక్షత్రవనం తీర్చిదిద్దబోతున్నాయి. అలాగే పంచవటి వనం కూడా ఉంది. మర్రి, మారేడు, జమ్మి, వేప, ఉసిరి వృక్షాలు పంచవటి వనంలో ఉంటాయి.

కొత్తూరు తాడేపల్లి వనం విస్తరణ

వేదాద్రి వద్ద కొత్త నగరవనం ఏర్పాటుతో పాటు విజయవాడకు సమీపంలో కొత్తూరు తాడేపల్లిలో ఉన్న నగరవనాన్ని విస్తరించాలని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇక్కడ నగరవనాన్ని 50 ఎకరాల్లో తీర్చిదిద్దారు. నిబంధనల ప్రకారం నగరవనం 125 ఎకరాల్లో ఉండాలి. ఆ స్థాయి స్థలం ఉంటేనే నగరవనం లోపల థీమ్ పార్కుల ఏర్పాటుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తూరు తాడేపల్లి నగరవనం 50 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. దీన్ని మరో 50 ఎకరాలకు విస్తరింపజేస్తే మరింత ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని భావిస్తున్నారు. ఆయా ప్రతిపాదనలను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేశారు. త్వరలోనే పట్టాలు ఎక్కవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నాక్ బృందంతో కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్, నాట్య విద్యార్థులు

కూచిపూడి కోర్సులపై నాక్ బృందం అభినందనలు

కూచిపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్దేంద్ర కళాపీఠంలో అమలవుతున్న నాట్య కోర్సుల పట్ల నాక్ బృందం అభినందనలు తెలిపినట్లు కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని నాక్ బృందం పరిశీలించగా, కూచిపూడి కళాపీఠం విద్యార్థులు వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ ఆధ్వర్యంలో తరంగం అంశాన్ని ప్రదర్శించటంతోపాటు కళాపీఠంలో అమలవుతున్న కోర్సులకు సంబంధించి నాట్య విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నాక్ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా నాక్ బృందం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, నాట్య విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మధురానగర్ రైల్వేస్టేషన్‌లో

రేపటి నుంచి పీఆర్ఎస్ కౌంటర్ ప్రారంభం

వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు అనుబంధంగా ఉన్న మధురానగర్ రైల్వే స్టేషన్‌లో ఈనెల 24 నుంచి ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్ (పీఆర్ఎస్‌సీ) పనిచేయనున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయ పీఆర్వో నుస్రత్ ఎం.మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు సత్యనారాయణపురంలో ఉన్న ఈ కౌంటర్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం మధురానగర్‌కు తరలించినట్టు తెలిపారు. ఇక్కడ అన్ రిజర్వ్ టిక్కెటింగ్ సిస్టమ్‌తో పాటు ప్రయాణికులకు రిజర్వేషన్లు, టిక్కెట్ల రద్దు, తదితరాలతో సహా అన్ని రకాల సేవలందుతాయన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 2.15 నుంచి రాత్రి 8 గంటల వరకు, ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే కౌంటర్ పనిచేస్తుందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపుపై హర్షం

● రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు 340 మద్యం షాపులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వడాన్ని గురుమూర్తి స్వాగతించారు. గౌడ సామాజిక వర్గానికిచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నామినేటెడ్ పోస్టుల్లో సైతం సముచితస్థానం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయిస్తామని చెప్పిన హామీని సీఎం నెరవేర్చారన్నారు. ఈ కేటాయింపుతో కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు.

స్వామి వివేకానంద పురస్కారానికి బుద్ధప్రసాద్ ఎంపిక

అవనిగడ్డ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ 'స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారం -2025'నకు ఎంపికయ్యారు. ఈ నెల 23న అనపర్తిలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పురస్కార ప్రదానోత్సవంలో శ్రీరామకృష్ణ మిషన్ - రాజమండ్రి అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ఈ పురస్కారం అందుకుంటారు.

26న రాష్ట్రస్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేథ-2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24న సాయంత్రం 5 గంటలలోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.



విజయవాడ చేరుకున్న క్రీడాకారులు

లబ్బీపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్, ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 27 వరకు విజయవాడ నగరంలో జరగనున్న 68వ స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల జాతీయ సెపక్ తక్రా పోటీలలో పాల్గొనే పలు రాష్ట్రాల క్రీడాకారులు బుధవారం నగరానికి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, తమిళనాడు జట్లు రైల్వే స్టేషన్‌కు చేరుకోగా వారిని వ్యాయమ ఉపాధ్యాయులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. క్రీడాకారులకు నగరంలోని పలు హోటళ్లల్లో వసతి ఏర్పాటు చేయగా వారికి అవసరమైన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు, రాష్ట్ర పాఠశాల క్రీడా సమైక్య కార్యదర్శి భానుమూర్తి రాజు పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి జట్లు రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన జరుగుతాయని పోటీల నిర్వహణ కార్యదర్శి సింహాద్రి రమేష్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



వజ్రమ్మ (102)

ఉంగుటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, కొయ్యగూరపాడుకు చెందిన శతాధిక వృద్ధురాలు పిడికిటి వజ్రమ్మ(102) మంగళవారం కన్నుమూశారు. ఈమె భర్త పిడికిటి పూర్ణచంద్రరావు స్వాతంత్ర్య సమరయోధుడిగా ఏడాదిపాటు బళ్లారి జైలులో జైలుశిక్ష అనుభవించారు. ఈయన 1993లో 77ఏళ్ల వయసులో చనిపోయారు. ఈ దంపతులిద్దరికీ పోతినేని వెంకట రత్నమ్మ (74) కొమ్మినేని సాయికుమారి (71) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. వారిద్వారా ముగ్గురు మనవళ్లు, ఇద్దరు మనవరాళ్లు, పది మంది మునిమనవళ్లు, మనవరాళ్లు, ఇద్దరు మునిముని మనమళ్లతో నాలుగు తరాలను వజ్రమ్మ చూశారు. తన 102 ఏళ్ల వయసులోనూ తనపని తానే స్వయంగా చేసుకుంటూ ఎంతో ఆరోగ్యంగా జీవించారని కుటుంబసభ్యులు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా భర్త పూర్ణచంద్రరావు అందుకున్న పింఛను ఆయన మరణానంతరం వజ్రమ్మ అందుకుంటున్నట్టు చెప్పారు. కాగా వజ్రమ్మ అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

డీఎస్పీ ధీరజ్‌కు బీజేపీ నాయకుల అభినందనలు

గుడివాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాజేంద్రనగర్‌లోని డీఎస్పీ కార్యాలయంలో నూతన డీఎస్పీ వి.ధీరజ్ వినీల్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పౌరుల రక్షణ, శాంతి భద్రతల కోసం పోలీస్ శాఖకు బీజేపీ మద్దతుగా నిలిస్తుందని పార్టీ పార్లమెంట్ కన్వీనర్ సూరే గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగడాల సతీష్, కె.కె.డి ప్రసాద్, మాచర్ల రామకృష్ణ, తేజ, శీలం శంకర్రావు, పల్లపోతు మురళీ, రవి ప్రసాద్, గోపిక, రీటా పాల్గొన్నారు.


ధీరజ్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేద్దాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు అందరం కలసి పనిచేద్దామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం గుడ్లవల్లేరు ఇరిగేషన్ బంగ్లాలో నిర్వహించిన నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. అందుకే రైతులకు పనిచేసే నీటిసంఘాల ప్రజాప్రతినిధులను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇరిగేషన్‌కు సంబంధించిన పనులన్నీ నూరుశాతం పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చివరి భూము లవరకూ ఇబ్బందులు లేకుండా సకాలంలో నీటిని సరఫరా చేసే విధంగా సాగే నీటి సంఘాలు అధికారులతో సమన్వయం అవుతూ చూసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లిన సమస్యపై అధికారులతో మాట్లాడి సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీ ఛైర్మన్‌లు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, పాలేటి ఆంజనేయులు, చలసాని ప్రసాద్, వీరమాచనేని నాగ జయరామ్, కొడాలి రామరాజు, రాజేష్, అట్లూరి స్వరూప్, ఇరిగేషన్ ఎఫ్ఏసీ కొడాలి బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఇరిగేషన్ అధికారుతో మాట్లాడుతున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రతీ ఒక్కరూ అక్షరాస్యత కలిగి ఉండాలి

మోపిదేవి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ మహిళ అక్షరాస్యత కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ రావి దుర్గావాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా 35 మంది టీచర్లకు ఉల్లాస్ క్యాలెండర్, మార్గదర్శిని పుస్తకాలను పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలు శ్రద్ధ తీసుకుని సంఘాల్లోని ప్రతీ ఒక్కరూ విద్యనభ్యసించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఫైనాన్షియల్ అక్షరం పట్ల నేటి ప్రపంచంలో ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలాన్ని నూరు శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దే బాధ్యత మహిళా సంఘాలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో స్వర్ణభారతి, ఏపీఎం డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద కుటుంబానికి రెడ్ క్రాస్ చేయూత

నాగాయలంక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పర్రచివర పంచాయతీ శివారు బిల్లీ గ్రాహం నగర్‌లో ఇటీవల జరిగిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి జంగం స్వామేరు కుటుంబం నిరాశ్రయులయ్యారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, మండల రెడ్‌క్రాస్ ఛైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్, గ్రామసర్పంచ్ మంచాల శ్రావణి, వీఆర్వో సాయిబాబు బుధవారం బాధితులను పరామర్శించారు. రెడ్‌క్రాస్ సంస్థ తరపున వారికి నిత్యావసరాలు, వంటపాత్రలు అందజేశారు.


నివాళులర్పిస్తున్న పాలకవర్గం, విద్యార్థులు

అక్కినేని వర్ధంతి

గుడివాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అక్కినేని నాగేశ్వరరావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో బుధవారం ఏఎన్ఆర్ విగ్రహానికి పాలకవర్గం, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందివాడ: మండలంలోని వెంకటరామాపురం సెంటర్‌లో అక్కినేని కళాకేంద్రంలో అక్కినేని అభిమాని జి.రామకృష్ణ (అమలాపురం) ఆధ్వర్యంలో బుధవారం మెరుగుమాల లక్ష్మణరావు అధ్యక్షతన గ్రామస్థులతో అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు బాగు చేయాలని ఆందోళన

పెదపారుపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుడివాడ టూ విజయవాడ రోడ్డు వేయాలని మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. పెదపారుపూడి మండలం రహదారి చాలా అధ్వానంగా ఉందని, అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గుడివాడ వయా మానికొండ - విజయవాడ రహదారులు వేయాలని కోరారు. చాపరాల పుణ్యేశ్వరరావు, మదిరి భీమరాజ్, మెట్టుపల్లి నాగేశ్వరరావు, ముత్యాల నాగరాజు, నాంచారయ్య, దుర్గారావు, పాల్గొన్నారు.



రైతలతో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

పొలం పిలుస్తోంది కార్యక్రమం

గుడివాడ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కల్వపూడి అగ్రహారం, గుంటాకోడూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి మాట్లాడుతూ పొలంలో ఏలాంటి మార్పులు జరిగినా వెంటనే తనను సంప్రదించాలన్నారు. వీఏఏలు స్నేహ, ఆశ, కల్వపూడి, గుంటా కోడూరు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకుల పాఠశాల తనిఖీ

గుడ్లవల్లేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యావ్యాప్తికి గురుకుల పాఠశాల్లో మెరుగైన వసతులు కల్పించటానికి విద్యాశాఖ మంత్రి లోకేష్ కృషి చేస్తున్నట్లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం మోటూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పరిసరాలు, మెనూ సక్రమంగా ఉండాలని మందలించారు. పాఠశాలను సక్రమంగా నిర్వహించాలని ప్రిన్సిపాల్ సంజీవనిని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి జనార్ధనరావు, టీడీపీ నాయకులు చెరుకూరి జగన్మోహనరావు, చీకటి శేషగిరిరావు, కటారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవోల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

పామర్రు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల (ఎన్జీవో) సంఘం రూపొందించిన 2025 వార్షిక క్యాలెండర్‌ను ఆ సంఘ జిల్లా నేత ఉల్లి కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చేతుల మీదగా ఆవిష్కరించారు. తూర్పు కృష్ణాజిల్లా ఎన్జీఓ సంఘాల ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటికి చెత్త సేకరణకు పుష్‌కార్టులు

గుడివాడ: స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో రూ.24లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 100పుష్‌కార్టులను మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పుష్‌కార్టులో 600 లీటర్ల సామర్థ్యంగల నాలుగు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశామన్నారు. పుష్‌కార్టుల ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తామన్నారు. ప్రతి 350 ఇళ్లకు మైక్రో పాకెట్ రూట్ మ్యాప్ సిస్టం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేకూరి జగన్మోహనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, ఏఈలు, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించండి

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అఖండ మెజార్టీతో గెలిపించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. స్థానిక పాలశీతల కేంద్రం ఫంక్షన్ హాల్లో బుధవారం రాత్రి పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితమంతా రాజకీయాలకే త్యాగం చేసిన ఘనత ఆలపాటిదేనన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు మాట్లాడుతూ, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించే బాధ్యత కూటమి నేతలు తీసుకోవాల్సి అవశ్యతను వివరించారు. కృష్ణాగుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తనకు విజయాన్ని అందించి చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర నేత పురందేశ్వరిలకు కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తాడిశెట్టి నరేష్, కృష్ణాడెల్టా ప్రాజెక్టు వైస్‌ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, రాజులపాటి శ్రీనివాసరావు, వీరపనేని శివరామ్, జనసేన ఎంపీటీసీ కూనపరెడ్డి సుబ్బారావు, మండపాక శంకర్‌బాబు, షైనేని ఇందిర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

కూచిపూడి: పెదముత్తేవి గ్రామంలో బుధవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. అనంతరం గ్రామాభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. పెదముత్తేవి నుంచి కారకంపాడు, కొండవరం - మొవ్వ వెళ్లే రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా శిబిరాన్ని పరిశీలించారు. మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఉప్పలపాటి నాగలక్ష్మి ప్రసన్న, పాలకవర్గ సభ్యులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

బస్సు బంపర్ తగిలి ఇరువురికి గాయాలు

పెదపారుపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుడివాడ - విజయవాడ వెళ్లే రహదారి మంచు కారణంగా బస్సు బంపరు తగిలి వాహనదారులకు గాయాలయ్యాయని గ్రామస్థులు తెలిపారు. వివరాల ప్రకారం గుడివాడ నుంచి విజయవాడ వెళ్లే నాన్ స్టాప్ వానపాముల గ్రామం వద్ద గోతుల కారణంగా బంపర్ తగిలి వెంట్రప్రగడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తున్న క్రమంలో గాయపడ్డారు. చోరగుడి రజని, జుజ్జువరపు రాంప్రసాద్ ముఠా పనికి గుడివాడ వెళ్తుండగా మార్గమధ్యలో గాయపడ్డారు. 108 ద్వారా గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భూషణగుళ్ల గ్రామం - పెదపారుపూడి మధ్య పెట్రోల్ బంకు వద్ద గోతులుండటం కారణంగా ఆటో బ్రేక్ వేయటంతో వెనుక బైక్ ఢీకొని గాయపడ్డారు.

అయ్యప్ప స్వామి దేవాలయంలో హుండీ చోరీ

కోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కోడూరు అయ్యప్ప స్వామి దేవాలయంలో హుండీ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15వ తేదీన శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లిన అనంతరం హుండీ చోరీ జరిగినట్లు తెలిపారు. అయ్యప్ప ఆలయం కింద ఉన్న కల్యాణ మండపంలో మాల ధరించిన స్వాములు నిత్యం పూజ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన అయ్యప్ప పీఠం వద్ద ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. హుండీ తీసుకువెళ్తున్న వ్యక్తి కనిపించగా, అతను ఎవరు అనేది తెలియలేదని తెలిపారు.



ఆర్టీసీ స్టాప్ ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

గుడ్లవల్లేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు గ్రామానికి ఆర్టీసీ బస్సులకు స్టాప్ ఏర్పాటు చేయాలని అంగలూరు గ్రామస్తులు పలువురు కోరుతూ బుధవారం గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజరు గుదే రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. అంగలూరులో బస్సులు ఆగుతున్నాయిగా అని ఆయన అడుగగా ఇది రిక్వెస్ట్ స్టాపని, కొందరు దూరంలో బస్సులు ఆపుతున్నారని అధికారిక స్టాప్ ఇవ్వాలని వారు కోరారు. గుడివాడ నుంచి అంగలూరుకు రూ.20, గుడ్లవల్లేరుకూ అదే చార్జి ఉందని, అలాకాక అంగలూరు స్టాప్‌కు రేటు తగ్గేలా చేయాలని కోరారు. స్టాప్ అయితే ఏర్పాటు చేయగలం కానీ టికెట్ రేటు తన పరిధిలోది కాదని డీఎం రాజేష్ అన్నారు. కార్యక్రమంలో పెద్దుబోయిన లక్ష్మీనరసింహరాజు, బొర్రా ధన కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, త్రిపురనేని బాబి, అనగాని నాగేంద్రబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు

నాగాయలంక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తలగడదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి 25 వరకు కృష్ణా జిల్లా సెకండరీ స్కూల్ గేమ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ సబ్ జోన్ బాలుర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాకమిటీ తెలిపింది.

మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని అంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో డిసెంబరులో కొంత భాగం వరి కోసి రైతులు అమ్ముకున్నారని, మిగిలి ఉన్న వరి కుప్పలన్నీ ఇప్పుడు నూరుస్తున్నారన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు చేసిన రైసుమిల్లులన్నీ తమకు కేటాయించిన లక్ష్యం పూర్తయిందని, రైతుల నుంచి ధాన్యం కొనడం లేదన్నారు. దాదాపు 3 లక్షల టన్నుల ధాన్యం అమ్ముకోవలసి ఉందన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

పెడన రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈమెయిన్స్ 2025 పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు ఉదయం169 మందికి గాను 161 మంది, మధ్యాహ్నం 153 మందికి 152 మంది అభ్యర్థులు హాజరయ్యారని పరీక్షా కేంద్ర నిర్వాహకులు పి.అశోక్‌కుమార్ తెలిపారు.

క్రీడలు నిర్వహించడం అభినందనీయం

గుడివాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఫొటో, వీడియోగ్రాఫర్లు తమ వృత్తితో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపిస్తూ ప్రతి ఏడాది క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక స్టేడియంలో గుడివాడ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీపీఎల్ 2025 క్రికెట్ పోటీలు ఘనంగా ముగిశాయి. సూపర్‌స్టార్ జట్టు విజేతగా నిలిచింది. యలవర్తి విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు హరిబాబు, కేతిరెడ్డి జయవంశీ పవన్, ఎండీ జిక్రియా, టోర్నమెంట్ ఆర్గనైజర్, యూనియన్ అధ్యక్షులు పంచకర్ల కృష్ణచైతన్య, కార్యదర్శి కోసూరి అనీల్‌బాబు, కోశాధికారి ఆళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

విజన్ డాక్యుమెంట్ వార్షిక ప్రణాళికపై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్లు

పెదపారుపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజన్ డాక్యుమెంట్ వార్షిక ప్రణాళికపై శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా రిసోర్స్ పర్సన్ సీహెచ్ మహంకాళిరావు అన్నారు. బుధవారం పెదపారుపూడిలోని వెలుగు కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులకు గతంలో మూడు విడతలుగా లక్ష్యం, గమ్యంపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక విజన్ డాక్యుమెంట్ తయారు చేయటం జరిగిందన్నారు. దానిలో భాగంగా ఆ విజన్ డాక్యుమెంట్‌లో ఏ మార్పు అంశాలను గుర్తించారో ఆ మార్పు అంశాలపై ఐదేళ్లకు ప్రణాళికను తయారు చేయటం, అలాగే ఈ సంవత్సరానికి ప్రణాళిక తయారు చేయటంపై గ్రామ సంఘాల అధ్యక్షులకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నందివాడ మండలం ఏపీఎం కెవి.వసంతరావు, సీసీ నాగమణి, రత్నకుమారి, అకౌంటెంట్ ఏసమ్మ, మండలంలోని అన్ని గ్రామసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మచిలీపట్నం టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పెద ఉల్లింగిపాలెం గ్రామానికి చెందిన చింతా విజయకుమార్ ఇటీవల జలాల్‌పేట నరసింహస్వామి గుడి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. రెక్కాడితే డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన విజయకుమార్‌కు వైద్యులు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకుని వెళ్ళారు. మంత్రి విజయవాడ హెల్ప్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 3 లక్షల 8వేలను చెక్కును అందజేశారు. ఎన్ఆర్ఐ చలమలశెట్టి బాలాజీ రూ. 15వేల ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మోకా రవి, చలమలశెట్టి శ్రీనివాసరావు, చలమలశెట్టి రమేష్, కోట రాజేష్, మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్యలను పరిష్కరించండి


సమస్యలను వివరిస్తున్న ఆటోనగర్ కార్మికులు

గుడివాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ సంస్థ ది కృష్ణా జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఐలా కమిషనర్ సాంబశివరావు దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. బుధవారం ఆటోనగర్ విచ్చేసిన ఆయనకు యూనియన్ నాయకులు స్వాగతం పలికారు. ఆటోనగర్‌లో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. చెత్త సమస్యను పరిష్కరించడానికి ఆటోనగర్‌లో పర్యటించినట్లు ఐలా కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖద్దూస్, నాయకులు ఆంజనేయులు, రషీద్‌బేగ్, మొహిద్దీన్, త్రినాథ్, బాషా, వీర్రాజు, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.





జనసేనకు 3 సహకార సంఘాలు

మచిలీపట్నం టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలంలోని 14 సహకార సంఘాలలో కూటమి నాయకులు చేసుకున్న ఒప్పందం ప్రకారం జనసేన పార్టీ నాయకులకు 3 సహకార సంఘాలు కేటాయించారు. త్వరలో సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఒక చైర్మన్, ఇద్దరు సభ్యులతో ఏర్పడే ఈ కమిటీల జాబితా ప్రభుత్వం జీవో రూపంలో అందించనుంది. ఈ నేపథ్యంలో జనసేన పార్టీకి అరిసేపల్లి, బుద్దాలపాలెం, వాడపాలెం సహకార సంఘాల చైర్మన్ల పదవులను కేటాయిస్తూ కూటమి నాయకులు నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణలు జరిపిన చర్చల్లో 3 సొసైటీలకు జనసేన పార్టీకి కేటాయించారు.

జరగని విలీనం.. తొలగని సమస్యలు

- 9 పంచాయతీలకు ఎన్నికలు దూరం
- విడుదల కాని 15వ ఆర్థిక సంఘ నిధులు
- తాగునీటికి, పారిశుధ్యానికి నిధుల కొరత



(మచిలీపట్నం టౌన్ - ఆంధ్రజ్యోతి)

మచిలీపట్నం నగర పాలకసంస్థలో బందరు మండలంలోని తొమ్మిది గ్రామాలను విలీనం చేసేందుకు 2019లో జారీ అయిన జీవో అమలు కాలేదు. దీంతో ఆ పంచాయతీ ఎన్నికలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నిక ఐదేళ్లుగా జరగలేదు. పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో ఉండిపోయాయి. పంచాయతీలకు, మండల పరిషత్‌కు రావలసి ఉన్న 15వ ఆర్థిక సంఘ నిధులు నిలిచిపోయాయి. దాంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీనివల్ల గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా కుంటుపడింది. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ పంచాయతీలకు ఎన్నికలు జరిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మచిలీపట్నం మునిసిపాలిటీని 2015 డిసెంబరులో నగర పాలక సంస్థగా చేస్తూ 40వ జీవో వెలువడింది. ఆ తరువాత నగర పాలక సంస్థ చేస్తే మునిసిపల్ పాలక వర్గం రద్దవుతుందని అప్పటి పాలకవర్గం ప్రభుత్వం ముందు ప్రతిపాదించడంతో 2016 ఫిబ్రవరిలో 35వ నెంబరు జీవో జారీ చేసి నగర పాలక సంస్థను మళ్లీ మునిసిపాలిటీగా మార్చారు. ఆ తరువాత 2019 ఏప్రిల్‌లో 165వ నెంబరు జీవో జారీ చేశారు. ఈ జీవోను అనుసరించి తిరిగి మచిలీపట్నం మునిసిపాలిటీ నగరపాలక సంస్థగా రూపొందింది. 2019లో బందరు రూరల్ మండలంలోని కరగ్రహారం, చినకరగ్రహారం, మేకావారిపాలెం, పోతేపల్లి, అరిసేపల్లి, సుల్తానగరం, ఎస్.ఎన్. గొల్లపాలెం, రుద్రవరం, గరాలదిబ్బ గ్రామాలను నగర పాలక సంస్థలోకి విలీనం చేయాలని ప్రభుత్వానికి నగర పాలకసంస్థ నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. ఆ ప్రతిపాదనలు నేటికి అమలుకు నోచుకోలేదు. దాంతోపాటు పంచాయతీల్లో ఎన్నికలు జరగలేదు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికలు ఈ 9 గ్రామాల్లో నిర్వహించలేదు. దాంతో ఈ గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది.

అందని 15వ ఆర్థిక సంఘ నిధులు...

నగర పాలక సంస్థలో ఈ తొమ్మిది గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియ ముడిపడిఉండటంతో కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు గత ఐదేళ్లుగా అందడం లేదు. దీంతో గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ పనులు నిలిచిపోయాయి. పారిశుధ్య పనులకు కావలసిన సామగ్రిని కొనుగోలు చేయలేని పరిస్థితి. కొన్ని పంచాయతీల్లో సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి. అంతే కాకుండా మండల పరిషత్ ఎన్నికలు జరగకపోవడంతో మండల పరిషత్‌కు రావలసి ఉన్న 15వ ఆర్థిక సంఘ నిధులు కూడా అందడం లేదు. ఒక్కొక్క గ్రామానికి 10 నుంచి 20 లక్షల వరకు ఏడాదికి రావలసి ఉన్న ఆర్థిక సంఘ నిధులు అందడం లేదు. మండల పరిషత్‌కు కోటి నుంచి కోటిన్నర రూపాయలు ఆర్థిక సంఘ నిధులు అందాల్సి ఉంది. ఇలా ఐదేళ్లుగా నిధులు అందకపోవడంతో పంచాయతీలు నిర్వీర్యమైపోతున్నాయి. సర్పంచ్ పదవుల కోసం ఆశించిన పలువురు నాయకులు పదవులు దక్కించుకోలేక పోతున్నారు. కరగ్రహారం, చినకరగ్రహారం, మేకావారిపాలెం, పోతేపల్లి, అరిసేపల్లి, గరాలదిబ్బ గ్రామాలకు ఎంపీడీవోలు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికలు జరిపించాలి



గ్రామ పంచాయతీలకు ఎన్నికలైనా జరిపించాలి. లేక గ్రామాలను నగర పాలక సంస్థలో విలీనమైనా చేయాలి. ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకుని గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధిపై దృష్టి సారించాలి. అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం.

- అమ్మిరెడ్డి శివయ్య, అరిసేపల్లి

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



గ్రామాల విలీనం ఫైలు ప్రభుత్వానికి పంపాం. దీనిపై ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నగర పాలక సంస్థ చేతుల్లో ఏమీ లేదు. ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం.

- హరిప్రసాద్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్

ప్రతి ఒక్కరూ అక్షరాస్యత కలిగి ఉండాలి

మోపిదేవి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ మహిళ అక్షరాస్యత కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ రావి దుర్గావాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా 35 మంది టీచర్లకు ఉల్లాస్ క్యాలెండర్, మార్గదర్శిని పుస్తకాలను పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలు శ్రద్ధ తీసుకుని సంఘాల్లోని ప్రతీ ఒక్కరూ విద్యనభ్యసించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఫైనాన్షియల్ అక్షరం పట్ల నేటి ప్రపంచంలో ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలాన్ని నూరుశాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దే బాధ్యత మహిళా సంఘాలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో స్వర్ణభారతి, ఏపీఎం డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

● నార్త్ తహసీల్దార్ నాగభూషణం

మచిలీపట్నం టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మచిలీపట్నం నూతన నార్త్ తహసీల్దార్ వి.నాగభూషణం అన్నారు. కలెక్టర్‌ను బుధవారం నాగభూషణం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. బాపులపాడు మండలం నుంచి నాగభూషణం ఇక్కడకు బదిలీపై వచ్చారు.



వడ్లమన్నాడు వద్ద గల సైఫన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి

పెడన రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ అవసరాలకు అందించే సాగునీరు అరకొరగా లభ్యంకావటంతో దిగుబడితగ్గి నష్టపోతున్నామని రైతుల మొరపెట్టుకోవడంతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ఇరిగేషన్, డ్రైనేజి అధికారులతో కలసి పర్యటించారు. లేళ్లగరువు, నెరికేపాలెం, నడుపూరు, కూడూరు, కొంకేపూడి, ఈదుమూడి గ్రామాల్లోని ఆయకట్టుకు నీరు చాలినంత అందటంలేదని, ఇక్కడ లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. దేవరపల్లి కంచడం, చోడవరం గ్రామాల వద్ద సమస్యలను గుర్తించారు. వాటిని పరిష్కరించి వచ్చే వ్యవసాయ సీజన్ నుంచి పూర్తిస్థాయిలో రైతులకు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, పామర్తి వెంటేశ్వరరావు, నీటి సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద కుటుంబానికి రెడ్‌క్రాస్ చేయూత

నాగాయలంక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పర్రచివర పంచాయతీ శివారు బిల్లీ గ్రాహం నగర్‌లో ఇటీవల జరిగిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి జంగం స్వామేరు కుటుంబం నిరాశ్రయులయ్యారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, మండల రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్, గ్రామసర్పంచ్ మంచాల శ్రావణి, వీఆర్వో సాయి బాబు బుధవారం బాధితులను పరామర్శించారు. రెడ్‌క్రాస్ సంస్థ తరపున వారికి నిత్యావసరాలు, వంటపాత్రలు అందజేశారు.

నేటి నుంచి ఆటల పోటీలు

నాగాయలంక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తలగడదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి 25 వరకు కృష్ణా జిల్లా సెకండరీ స్కూల్ గేమ్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ సబ్ జోన్ బాలుర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాకమిటీ తెలిపింది.

మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని అంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో డిసెంబరులో కొంత భాగం వరి కోసి రైతులు అమ్ముకున్నారని, మిగిలి ఉన్న వరి కుప్పలన్నీ ఇప్పుడు నూరుస్తున్నారన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు చేసిన రైసుమిల్లులన్నీ తమకు కేటాయించిన లక్ష్యం పూర్తయిందని, రైతుల నుంచి ధాన్యం కొనడం లేదన్నారు. దాదాపు 3 లక్షల టన్నుల ధాన్యం అమ్ముకోవలసి ఉందన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

పెడన రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈమెయిన్స్ 2025 పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు ఉదయం169 మందికి గాను 161 మంది, మధ్యాహ్నం 153 మందికి 152 మంది అభ్యర్థులు హాజరయ్యారని పరీక్షా కేంద్ర నిర్వాహకులు పి.అశోక్‌కుమార్ తెలిపారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

మోపిదేవి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాలను ప్రతీ ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నంద కిషోర్ కోరారు. వెంకటాపురం, మోపిదేవి గ్రామాల్లో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. మోపిదేవిలో సర్పంచ్ నందిగం మేరీ రాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు శిబిరాలను ప్రారంభించారు. గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయక సిబ్బంది లక్ష్మీనారాయణ, రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు.



మోపిదేవిలో పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ మేరీ రాణి

కోడూరులో రూ.15 వేల పింఛన్ల పరిశీలన

కోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో 15 వేల పింఛన్ తీసుకుంటున్న డిజేబుల్ పింఛన్లను వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక బృందం సభ్యులు పరిశీలించారు. లింగారెడ్డిపాలెం, ఉల్లిపాలెం, జయపురం, కొత్తపాలెం, మాచవరం గ్రామాల్లో బుధవారంఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా రూ.15 వేలు తీసుకుంటున్న 75 మంది లబ్ధిదారులను ప్రభుత్వం నియమించిన ప్రత్యేక బృందం తనిఖీ చేసింది. గ్రామాల్లో పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు.



పింఛన్లను తనిఖీ చేస్తున్న వైద్య బృందం

పది విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

● ఆచార్య సూదాబత్తుల విజయకుమార్

మచిలీపట్నం, జనవరి 22 : ప్రణాళికాబద్ధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పదో తరగతి విద్యార్థులు చదువుకుంటే అధిక మార్కులు సాధించవచ్చని ఉమ్మడి కృష్ణాజిల్లా మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ కెరీర్ గైడెన్స్ చైర్మన్, ఆచార్య సూదాబత్తుల విజయకుమార్ అన్నారు.మచిలీపట్నం రుస్తుంబాదా నగర పాలక సంస్థ బాలుర పాఠశాలలో బుధవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో విజయకుమార్ మాట్లాడారు. విజయీభవ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఉల్లి రంగా రావు, కె.రాజేంద్ర ప్రసాద్, అశోక్ పాల్గొన్నారు. అనంతరం 7,8,9 తరగతుల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



మాట్లాడుతున్న ఆచార్య సూదాబత్తుల విజయకుమార్

గిడుగు సేవలు చిరస్మరణీయం

అవనిగడ్డ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంట రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీక్షేత్రంలో బుధవారం గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు వర్ధంతిని గ్రామీణ యువ జన వికాస సమితి ఆధ్వర్యంలో జరుగగా, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దివిసీమ లలిత కళాసమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజనాల వీరబాబు, ఎంపిటిసి బొప్పన భాను, కూటమి నాయకులు పాల్గొన్నారు.



తెలుగురావుపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

మినుములో సస్యరక్షణ చర్యలు పాటించాలి

ఘంటసాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మినుము సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీ కృష్ణ తెలిపారు. తెలుగురావుపాలెం, చినకళ్లేపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము సాగులో రైతులు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు జి.దయానా, జి.రవిచంద్ర, రైతులు పాల్గొన్నారు.

గూడూరు: రామరాజుపాలెం, చిట్టిగూడూరు, కోకనారాయణపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఆంజనేయకుమార్ మాట్లాడుతూ, మినుములో కాండం గజ్జి తెగులు నివారణకు హెక్సాకోనజోల్ గుళికలు ఎకరానికి 400 గ్రాముల చొప్పున పలుచగా తడిపెట్టినప్పుడు చల్లాలన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

నాగాయలంక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ రంగంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. భావదేవరపల్లిలో ఫ్లడ్ డామేజ్ రిపేర్ ఫండ్స్ రూ.7.95 లక్షలతో చేపట్టిన పనుల్లో భాగంగా భావదేవరపల్లి రెగ్యులేటర్, మండపాకల హెడ్ స్లూయిజ్‌లకు ఏర్పాటు చేసిన నూతన గేట్లను బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లిఖార్జునరావు, సర్పంచ్ మండలి ఉదయ్ భాస్కర్, ఏఈఈలు రవితేజ, బ్రహ్మానందబాబు పాల్గొన్నారు.



మండపాకల- ఇరాలి రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మండపాకల - ఇరాలి రోడ్డు నిర్మాణం

కోడూరు : మండపాకల - ఇరాలి రోడ్డును రూ.3,88,24,000లతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. మండపాకల నుంచి ఇరాలి వరకు పంచాయతీ రాజ్ శాఖ ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ పర్యవేక్షణలో ఐదు కిలోమీటర్లు నిర్మిస్తున్న నూతన తారు రోడ్డును ఆయన బుధవారం పరిశీలించారు. మండపాకల నుంచి చింతకోళ్ల వరకు ఉన్న రోడ్డును అభివృద్ధి చేస్తామని, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, పీఆర్ డీఈఈ పగడాల సురేష్‌బాబు, ప్రాజెక్టు జేఈ నందిపాటి రాజశేఖరరెడ్డి, ఏఈఈలు బ్రహ్మానంద బాబు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుదాస్ కుటుంబానికి పరామర్శ

రామకృష్ణాపురంలో బుధవారం అద్దంకి ప్రభుదాస్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. గ్రామ మాజీ సర్పంచ్ టీడీపీ నాయకులు అద్దంకి పాండురంగారావు సోదరుడు ప్రభుదాస్ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని బుద్ధప్రసాద్ పరామర్శించారు. ప్రభుదాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వర రావు, పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయంలో హుండీ చోరీ

కోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కోడూరు అయ్యప్ప స్వామి దేవాలయంలో హుండీ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15వ తేదీన శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లిన అనంతరం హుండీ చోరీ జరిగినట్లు తెలిపారు. అయ్యప్ప ఆలయం కింద ఉన్న కల్యాణ మండపంలో మాల ధరించిన స్వాములు నిత్యం పూజ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన అయ్యప్ప పీఠం వద్ద ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. హుండీ తీసుకువెళ్తున్న వ్యక్తి కనిపించగా, అతను ఎవరు అనేది తెలియలేదని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మచిలీపట్నం టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పెద ఉల్లింగిపాలెం గ్రామానికి చెందిన చింతా విజయకుమార్ ఇటీవల జలాల్‌పేట నరసింహస్వామి గుడి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. రెక్కాడితే డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన విజయకుమార్‌కు వైద్యులు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకుని వెళ్లారు. మంత్రి విజయవాడ హెల్ప్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 3 లక్షల 8వేలను చెక్కును అందజేశారు. ఎన్ఆర్ఐ చలమలశెట్టి బాలాజీ రూ. 15వేల ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మోకా రవి, చలమలశెట్టి శ్రీనివాసరావు, చలమలశెట్టి రమేష్, కోట రాజేష్, మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను రైతుకు అప్పగించాలి

నాగాయలంక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దౌర్జన్యంగా నూర్పి ట్రాక్టర్లతో తీసుకెళ్లిన వరి పంటను బాధిత రైతుకు అప్పగించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కమ్మనమోలు గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ ఏడుకొండలు అనే రైతుకు తన ఊరిలో 5.70 ఎకరాల పొలంలో పండిన పంటను అదే గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ మహాలక్ష్ముడు ఈ నెల 7వ తేదీన తన కిరాయి మనుషులు, వరి కోత మిషన్లతో ఏడుకొండలు పొలంలోకి దౌర్జన్యంగా వచ్చి పంటను తరలించిన ఉదంతం తెలిసి బుధవారం ప్రజా సంఘాల నేతలు కమ్మనమోలు గ్రామం వచ్చారు. బాధిత రైతు కొక్కిలిగడ్డ ఏడుకొండలును పరామర్శించి పొలంలోకి వెళ్లి విషయాలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తీసుకెళ్లిన వరి పంటను ఏడుకొండలుకు మహాలక్ష్ముడు అప్పగించాలని, లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని సింగోతు నాగేంద్రరావు, లంకే సుబ్బారావు, చెన్ను చిన వెంకటేశ్వరరావు, ఆర్.సుబ్బారావు, తండు సూరిబాబు తదితరులు తెలిపారు.

పైడమ్మతల్లి దేవస్థానంలో నెల సంబరం

పెడన, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మతల్లి దేవస్థానంలో బుధవారం అమ్మవారికి నెలసంబరం నిర్వహించారు. జాతర ఉత్సవాలు ముగిసిన తరువాత అమ్మవారికి నెల సంబరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి నెల సంబరం జరుపుకుంటున్న పైడమ్మతల్లిని దర్శించుకున్నారు.